
# జనబలం

ప్రజలే ప్రభువులు

నవంబర్ 2024 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-


## అభివృద్ధి - ఆర్థిక అంతరాలు





## ఆర్థిక నోబెల్ పాఠాలు

## పార్టీలకతీతంగా ఏపీని కాపాడుకుందాం

## సిటిజన్ చార్టర్లు 2.0

## తెలంగాణ పాఠశాల విద్య : పెరిగిన వ్యయం - మెరుగుపడని ఫలితాలు



అమెరికా లాంటి పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశంలో డొనాల్డ్ ట్రంప్ లాంటి వ్యక్తి అధ్యక్షుడిగా రికార్డు విజయం సాధించడం మనల్ని నిరుత్తరులను చేస్తుంది. అమెరికా కావచ్చు, ఇతర అనేక మెరుగైన ప్రజాస్వామ్య దేశాలు కావచ్చు. ఎదుర్కొంటున్న ఒడిదుడుకుల్ని చూస్తున్నాం. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థను నడపటం ఎంత కష్టమో వాటినుంచి మనకు అర్థమవుతుంది. ప్రజలు తాత్కాలికంగా కోరుకుంటున్న దానికి, ప్రజల దీర్ఘకాల ఉమ్మడి అవసరాలకు మధ్య తరచూ ఘర్షణ తలెత్తుతుంటుంది. ప్రజలకు తాత్కాలిక ఉపశమనాన్నిస్తూనే వారి జీవితాలకు నిజంగా అవసరమైనది అమ్మటం ప్రజాస్వామ్య నాయకత్వానికి అసలైన సవాలు. వైఫల్యాలకు విరుగుడు మరింత మెరుగైన ప్రజాస్వామ్యం మాత్రమే. అమెరికా లాంటి దేశాల నుంచి పాఠాలు నేర్చుకుంటూనే వందేళ్ల మైలురాయిని చేరే క్రమంలో వచ్చే పాతికేళ్లలో మనం సాధించాల్సింది చాలా ఉంది.



ఆర్థికాభివృద్ధిని కాపాడుకుంటూనే చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి, స్థానిక ప్రభుత్వాల సాధికారిత మొదలైన మౌలిక లక్ష్యాల్ని సాధించుకోవాలి. ప్రతి పౌరుని శక్తి సామర్థ్యాలను వికసింపచేసి, నివారించదగ్గ బాధలను తొలగించి సగర్వంగా చెప్పుకోగలిగిన ఒక సమున్నత దేశంగా ఆవిర్భవించడం భారత్‌కి పూర్తిగా సాధ్యం.

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

నవంబర్ 2024

సంపుటి 26 సంచిక 11


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కు IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





05 పార్టీలకతీతంగా ఏపీని కాపాడుకుందాం

06 అభివృద్ధి కోసం మెజారిటీని సృష్టించగలమా?

13 భారత్ అభివృద్ధికి అవసరం ఆర్థిక నోబెల్ ఆలోచనలు

17 అస్పష్టతలో స్పష్టత హర్యానా ఫలితాలు

31 నిరంతరం లక్ష్యం దిశగా ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# అనుభవానికి వస్తే తత్వం బోధ పడిందా?

సంపాదకీయం

రాష్ట్రాల బడ్జెట్లు, ఆర్థిక పరిస్థితి, అమలు సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ఉచిత పథకాలు ప్రకటించడం పార్టీలకు సరైంది కాదని ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలు ఈ నెలలోనే జరుగుతున్న క్రమంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా అనుచిత ఉచితాలపై మరొక మారు దేశవ్యాప్త చర్చకు దారి తీశారు.

ఆయన మాటలను అభినందించే లోగానే సంప్రదాయ రాజకీయ పార్టీల నేతలు తరచుగా చెప్పే విధంగానే..నా వ్యాఖ్యలను వక్రీకరించారని కూడా ఆయనే సెలవిచ్చారు. అనుచిత ఉచితాలపై మాట మాత్రంగా కూడా ప్రస్తావించడానికి వివిధ జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా సిద్ధంగా లేవనడానికి ఇదో ఉదాహరణ. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు ఉచితాలకు ప్రజలను అలవాటు చేసి ఎన్నికల మ్యానిఫెస్టోలలో అలవి గాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాకా అవి అమలు చేయలేక తలలు పట్టుకుంటున్న వైనం మనం చూస్తూనే ఉన్నాం. మొన్న కర్ణాటకలో ఐదు గ్యారంటీలు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలు 13 ఉప హామీలు ఇచ్చి ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నిన్న హర్యానాలో ఇదే రకం హామీలు ఇచ్చినా ఆ రాష్ట్ర ప్రజలు పట్టం కట్టలేదు. అనుభవానికి వస్తే తత్వం బోధపడినట్లు ఈ విషయం తెలుసుకున్న ఖర్గే ఇలాంటి వ్యాఖ్యలు చేశారా అనిపిస్తుంది.

"తిలా పాపం తలా పిడికెడు" అన్నట్లు ఈ విషయంలో బీజేపీ కూడా ఏమాత్రం తీసిపోలేదు. జాతీయస్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుచిత ఉచితాలకు వ్యతిరేకం అంటూనే "నోరు మాట్లాడి నొసలు వెక్కిరిస్తుందన్నట్లుగా" బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎన్నికలు వస్తే ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రజలను మభ్యపెట్టడానికి ఉచిత హామీలనే తమ మేనిఫెస్టోలలో పెడుతుంది. ఇక ప్రాంతీయ పార్టీల సంగతి చెప్పనవసరం లేదు. తమిళనాడులోని ద్రవిడ పార్టీలతో సహా తెలుగు రాష్ట్రాలలోని తెలుగుదేశం, బీఆర్ఎస్, వైసీపీ, జనసేన పార్టీలతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న అనేక ప్రాంతీయ పార్టీలు ప్రజలను ఎన్నికలలో ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మభ్యపెట్టడానికి అనేక ఉచిత హామీలు ఇస్తూనే ఉన్నాయి. ఆ హామీలు అమలు చేయలేని పరిస్థితులలో విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

ఈ దశలో ఒక విషయం ఆలోచించాలి..ఎక్కడా కూడా దేశవ్యాప్తంగా ఇటీవల ఇస్తున్న ఉచిత హామీల విషయమై ప్రజల నుంచి డిమాండ్ రావడం లేదు. ప్రజలు అడగకుండానే అన్ని పార్టీలు పోటీ పడి మరీ హామీలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరుస్తున్నాయి. అవి తీర్చలేక చివరికి చతికిల బడుతున్నాయి. మళ్లీ ప్రజలను మభ్య పెట్టడానికి మైండ్ గేమ్ పాలిటిక్స్, డైవర్షన్ పాలిటిక్స్‌ను ఉపయోగిస్తూ అనేక వివాదాస్పద అంశాలను ముందుకు తెస్తూ తమను తాము ఆత్మ రక్షణ చేసుకోవడానికి ఎదుటి పార్టీల మీద మాటల దాడులు చేస్తూ కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయి.

రాజకీయ పార్టీలు ఇచ్చేవన్నీ అనుచిత ఉచితాలని అనలేము. అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిందే. కానీ ఈ రెండిటి మధ్య ఒక సన్నటి గీత రాను రాను మాయమైపోతుందన్నది ఆలోచించాలి. సంక్షేమం పేరిట రాష్ట్ర బడ్జెట్ మొత్తం ఖర్చయిపోతే అభివృద్ధికి ఏం మిగులుతుందని రాజకీయ పార్టీలు ఆలోచించాలి. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన వంటివి చేయాల్సిన ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనుచిత ఉచితాలు ప్రకటించడం వల్ల ఆయా రాష్ట్రాలు అప్పుల పాలవుతున్నాయి. మళ్లీ వడ్డీలతో సహా అప్పులు చెల్లించడానికి మరిన్ని అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ సంక్షేమ పథకాల వల్ల పార్టీల గెలుపోటములు నిర్ణయం అవుతున్నాయా అంటే కొంతవరకే అవుతున్నాయి. కానీ ప్రజలు ఈ రాజకీయ పార్టీల మోసాలను గమనిస్తూనే ఉన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా తమ సంక్షేమ పథకాలు ఆగవని తెలుసుకొని ఎవరిని గెలిపించాలో వారినే గెలిపిస్తున్నారు. ఎవరిని ఓడించాలో వారిని ఓడిస్తున్నారు. రాజకీయ పార్టీల కంటే ప్రజలే తెలివిగా ఎన్నికలలో తీర్పులు ఇస్తున్నారు.

ప్రభుత్వం అంటే..ప్రజల అపరిమితమైన ఆకాంక్షలకు తమ దగ్గర ఉన్న పరిమితమైన వనరులతో వారధి కట్టే రాజకీయం చేయాలి. కానీ జనాకర్షణ పథకాలను ప్రకటిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయిస్తూ, చివరికి పుట్టిన బిడ్డ నుండి కాటికి కాలు జాపిన పండు ముదుసలి వరకు అప్పుల భారాన్ని చేతికిస్తూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయి.

ఈ విష వలయంలో చిక్కుకుని రాజకీయ పార్టీలు ప్రజల విశ్వసనీయతను కోల్పోతున్నాయి. ఈ అనుచిత ఉచితాలపై ఇప్పటికే కోర్టులు జోక్యం చేసుకుంటున్నా, ఎన్నికల కమిషన్ హెచ్చరిస్తున్నా పార్టీల తీరు మారడం లేదు. ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలతోనైనా అనుచిత ఉచితలపై మరొకసారి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం అన్ని రాజకీయ పార్టీలకు ఉంది. రాజకీయ పార్టీలు ప్రకటించే అనుచిత ఉచితాలన్నీ ఎవరి జేబులో నుంచో ఇవ్వడం లేదు తాము చెల్లిస్తున్న పన్నుల డబ్బే అనే అవగాహన కొంతమేర ప్రజలకు వచ్చింది. ఈ అవగాహనను ఇంకా ఓటర్లలోకి తీసుకెళ్లి "అనుచిత ఉచితాలు వద్దు- అభివృద్ధే ముద్దు" అనే నినాదం రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పటివరకు "యథా రాజా తథా ప్రజా"అనే నానుడి ఉంది. దీన్ని "యథా ప్రజా తథా రాజా" అనే విధంగా మనం తిరగరాయాల్సిన సమయం ఆసన్నమైంది.

–బండారు రామ్మోహనరావు

# పార్టీలకతీతంగా ఏపీని కాపాడుకుందాం



దేశ చరిత్రలోనే అసాధారణ రీతిలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని ప్రజల జీవితాల్నీ, రాష్ట్ర భవిష్యత్తుని కాపాడేందుకు ప్రభుత్వంతోపాటు పౌర సమాజం కూడా చొరవచూపాల్సి ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోని గత పాలకుల వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. రాష్ట్ర సొంత ఆదాయం యూనియన్ పన్నుల వాటాతో కలిపి సుమారు రూ. 1.40 లక్షల కోట్లు ఉండగా, ఇందులో 63 శాతం వడ్డీల చెల్లిం పులకే సరిపోతోందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్ర భవి ష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆంధ్రపదేశ్‌లో ఆర్థిక ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు, భవిష్యత్తు పరిరక్షణకు తక్షణ చర్యలు, రోడ్ మ్యాప్ ఆవశ్యకతపై విజయవాడలో మీడియాతో జేపీ మాట్లాడారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాజ్జీ, సీనియర్ నేతలు డాక్టర్ పట్టాభిరామయ్య, వజీర్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన వ్యక్తిగా చంద్రబాబుకు సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతం ఏపీకి పెట్టుబడులు తెచ్చి అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉంది. అయితే రోజువారీ ఖర్చులకే రాష్ట్రం సతమతమవుతుంటే కోలుకోవటం కష్టమవుతుంది. రాష్ట్ర జీఎస్‌డీపీ నిష్పత్తి కనుగుణంగా అప్పు పరిమితిని రాష్ట్రం ఇప్పటికే దాటేసింది. ఈ పరిస్థితుల్లో వడ్డీలు తగ్గించేలా యూనియన్ ప్రభుత్వాన్ని ఒప్పించాలి. వీలైతే అయి దేళ్లపాటు రుణ చెల్లింపులు వాయిదా వేసేలా చూడాలని జేపీ సూచించారు. ఈ విషయంలో పార్టీలకతీతంగా కూర్చుందామని, అందరూ కలిసికట్టుగా యూనియన్ సహకారం తీసుకుందామన్నారు. ప్రజల కష్టం కారణంగా 7–8 శాతం వృద్ధిరేటు నమో దవుతోంది. ఏటా 10–12 శాతం ఆదాయం పెరుగుతుంది. వడ్డీలు, అప్పుల భారం పెరగకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే అయిదేళ్లలో సమస్య పరిష్కారమై జీఎస్‌డీపీలో అప్పుల వాటా 35శాతానికి వస్తుందని జేపీ వివరించారు.

**గత ప్రభుత్వ హయాంలో అప్పు రూ. 9.74 లక్షల కోట్లకు చేరింది. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలే రూ. 1.35 లక్షల కోట్లున్నాయి. మొత్తం వడ్డీ చెల్లింపులకే ఆదా యంలో మూడింట రెండొంతులు ఖర్చువుతోంది. డీఎస్‌డీపీలో 68 శాతం అప్పులున్నాయి. మన పక్క రాష్ట్రాలైన ఒడిశా 15శాతం, తెలంగాణ 38శాతం, కర్ణాటక 25 శాతం, తమిళనాడులో 34శాతం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో 30 శాతం చొప్పున అప్పులు ఉన్నాయి. అదే సమయంలో పన్నుల భారం ఎక్కువగా ఉంది. పెట్రోల్‌పై దేశంలోనే అత్యధికంగా సెస్ వసూలు చేస్తున్నాం. ప్రభుత్వం సరైన రోడ్‌మ్యాప్‌తో ఆర్థిక క్రమ శిక్షణ పాటించి చర్యలు తీసుకుంటే ఏపీ 15శాతం వృద్ధి రేటు నమోదు చేయటం అసాధ్యం కాదు అని జేపీ పేర్కొన్నారు.**

## అదనపు ఖర్చులేని కీలకరంగాలపై దృష్టి సారించాలి

**విద్య:** ప్రభుత్వం విద్యకు అదనంగా ఏమీ ఖర్చు చేయనక్కర్లేదు. ఇప్పటికే ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వ పాఠశాలలో ఏటా రూ. లక్ష వరకు ఖర్చు చేస్తోంది. అయినా నూటికి 80శాతం మందికి చదువు రావటం లేదు. విద్యారంగమంటే టీచర్ల నియామకం, బదిలీలు, డీఎస్సీలు, మెగా డీఎస్సీలు కాదు. విద్య అంటే పాస్ మార్కులు, ర్యాంకులు కాదు. ప్రమాణాలు పెరగాలి. అందు కోసం ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఇంకా కొన్ని సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని జేపీ సూచించారు.

**చిన్న పట్టణాలు:** రాజధానిగా, గ్రీన్‌ఫీల్డ్ నగరంగా అమరావతిని అభివృద్ధి చేయటం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఎంతో అవసరం. కానీ అదే సమయంలో తక్కువ నైపుణ్యాలున్న వాళ్లు పొట్టచేత పట్టుకుని గ్రామాల నుంచి వలస వెళ్లాల్సిన అవసరం రాకుండా చిన్న పట్టణాలు అభివృద్ధి చేయండి. ప్రభుత్వం మీద పెద్ద ఆర్థిక భారం కూడా ఉండదు. జాతీయ స్థాయిలో ప్రభుత్వం నుంచి నిధులను ఉపయోగించి టౌన్ ప్లానింగ్‌కి అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తే చాలు. మెరుగైన రవాణా, పెద్ద వర్షాలు పడినా వరదలు రాకుండా తట్టుకునే వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. దీనివల్ల అసంఘటితరంగాల్లో ఉన్నవారికి ఉపాధి వస్తుంది. పెట్టుబడులు వస్తాయి అని జేపీ తెలిపారు.

## కులాన్ని, ముఠా పోరాటాల్ని పక్కన పెట్టండి

ఈ పార్టీ అధికారంలో ఉంటే అవతలి పార్టీ వాళ్ల మీద దాష్టీకం చేయడం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, బూతులు తిట్టుకోవడం వంటి ధోరణులకు స్వస్తి చెప్పాలి. రాష్ట్రానికి కీలకమైన ఈ అయిదేళ్లు పాలనపై దృష్టి పెట్టాలి గానీ, రాబోయే ఎన్నికలపై కాదు. ముఠా తత్వాలు వీడండి. కులాన్ని మీ కుటుంబానికి పరిమితం చేయండి అని జేపీ విజ్ఞప్తి చేశారు. ★

# అభివృద్ధి కోసం మెజారిటీని సృష్టించగలమా?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



అభివృద్ధి ప్రజలందరికీ ప్రయోజనకరం. దీర్ఘకాలంలో వారి జీవితాల్ని మెరుగుపరుస్తుంది. సముద్రమట్టం పెరిగితే పడవలన్నిటినీ పైకెత్తుతుంది; అభివృద్ధి కూడా ప్రతి ఒక్కరి స్థాయినీ పెంచుతుంది. కానీ తక్కువ నైపుణ్యాలున్నవారి కంటే నైపుణ్యం, ఉత్పాదకత ఉన్న వారికి ఎక్కువ లాభాల్ని చేకూరుస్తుంది. రుణ, పెట్టుబడి అవకాశాలున్నవారు, ఆర్థిక స్వేచ్ఛ, హక్కులను పూర్తిస్థాయిలో అందుకోగలిగేవారు ఆర్థికాభివృద్ధి నుంచి ఎక్కువ లబ్ధి పొందుతారు. కులం కారణంగా ముక్కలైన సమాజంలో పుట్టుక నేపథ్య పరిస్థితులు ఎక్కువమంది పిల్లల భవిష్యత్తుని శాసిస్తాయి. ప్రభుత్వ వైఫల్యం అవకాశాలలేమిని మరింత పెంచుతుంది. ఒకవంక అభివృద్ధి అందరి జీవితాలనూ మెరుగుపరుస్తుంటే, ఇంకోవంక అసమానతలు పెరుగుతుంటాయి.

మన రాజకీయ చర్చంతా ఇంకా ఎక్కువ పన్నులు విధించటం, వారసత్వ, సంపద పన్నులు వేయటం వంటి విఫల ఆలోచనల చుట్టూనే ఉన్నకొద్దీ తిరుగుతోంది. అయ్యా, ఈ విధానాలన్నిటినీ అమలు చేశాం, మన ఆర్థిక వ్యవస్థకి అపార నష్టం చేశాం, పేదరికాన్ని కొనసాగిస్తున్నాం. 70 వ దశకం తొలినాళ్లలో, మన గరిష్ట ఆదాయ పన్ను రేటు 97.75%. రూ.2,00,000 వార్షిక ఆదాయం దాటినవారంతా అంత పన్నూ చెల్లించాల్సి వచ్చేది (85% ఆదాయ పన్ను + 15% పన్నుపై సర్ ఛార్జి)! 1985 వరకు మనకు వారసత్వ పన్ను ఉండేది. 2015 వరకు సంపద పన్ను ఉంది. ఈ రెండు పన్నుల ఆదాయం అంతంతమాత్రం కాగా, వాటి వసూలు ఖర్చు మాత్రం ఆదాయాన్ని మించి పోయేది! దీంతోపాటు, అధిక పన్నుల జమానా అధికారులకు అక్రమార్జన అవకాశమైంది. ఆదాయాన్ని దాచిపెట్టి లాభపడటానికి, నల్లడబ్బు ఆర్థిక వ్యవస్థకి దారితీసింది.

ఆర్థిక శాస్త్రంలో, ప్రభుత్వ విధానాల్లో బహుశా అత్యంత ప్రాధాన్య పదం 'ప్రోత్సాహకాలు'. ఆ ప్రోత్సాహకాల్ని వక్రమార్గం పట్టించే చట్టాల్ని, విధానాల్ని చేసినా, అనుత్పాదక లేదా సామాజికంగా బలహీనపరిచే ప్రవర్తనను ప్రోత్సహించినా, ఏ స్థాయి నియంత్రణా ఉపయోగపడదు. నిజానికి ఆ రకమైన పరిస్థితుల్లో ఎక్కువ నియంత్రణ బలవంతపు అవినీతి వసూళ్లకి దారితీస్తుంది.

వారసత్వ పన్నునో, సంపద పన్నునో, అధిక పన్ను విధించటాన్నో తీసుకోండి. తమ శ్రమకు, నైపుణ్యానికి తగ్గ ఫలితాల్ని ఒక వ్యక్తి అనుభవించలేకపోతే కష్టపడటానికి ప్రోత్సాహకం ఉండదు. వ్యవస్థాపక చొరవ ఆవిరైపోతుంది. పని చేసే ఆసక్తి అంతరించిపోతుంది. కొత్త పెట్టుబడులు, ఆవిష్కరణలు, అభివృద్ధి మందగిస్తాయి. పేదరికం కొనసాగుతుంటుంది. ఆదాయాన్ని, సంపదను ఎలా దాచిపెట్టాలి, ఆస్తుల్ని తర్వాతి తరానికి అనధికారికంగా ఎలా బదిలీ చేయాలి లాంటి అంశాల మీద శక్తియుక్తుల్ని అనుత్పాదకంగా వెచ్చించటం ఎక్కువవుతుంది. ఒక విజయవంతమైన ఎంటర్‌ప్రెన్యూరో, ఆవిష్కర్తో, సంపద సృష్టికర్తో అలాంటి తిరోగమన ధోరణుల్ని భరించాల్సిన అవసరం ఈవేళ లేదు. వ్యాపారానికి ఎక్కడ ఎక్కువ సానుకూలతలుంటే అక్కడికి తరలిపోతారు. వారిని ఏదీ ఆపలేదు. కాబట్టి ఇష్టారాజ్యం పన్నులు విధించటం వల్ల ఆదాయాలు రావు సరికదా, అభివృద్ధికి గండిపడుతుంది. చివరికి వినాశకర ఫలితాలొస్తాయి. ముఖం మీద కోపంతో ముక్కుని కోసుకోవటం పనికిమాలిన ఆలోచన. ఇడీ అమీన్ ఉగాండా, ముగాబే జింబాబ్వే, వెనిజువెలా, ఉత్తర కొరియా, తూర్పు జర్మనీ, డెంగ్ జియావోపింగ్ ముందుకాలంనాటి చైనా, సోవియట్ యూనియన్, ఇంకా పలు దేశాలు సంపద పంపిణీ ప్రయోగాన్ని భారీస్థాయిలో చేశాయి. ఆర్థిక ఫలితాల్లో బలవంతపు సమానత్వాన్ని సాధించేందుకు ప్రయత్నించాయి. ఏం జరిగిందో చూశాం.

పరిష్కారం 1991కి ముందున్న విధానాలను, వినాశకర పన్నుల పద్ధతి, మితిమీరిన నియంత్రణను తిరిగి తీసుకురావటంలో లేదు. సంపదను ప్రభుత్వం సమర్థంగా, నిజాయతీగా పంచగలదని నమ్ముకోవటంలో లేదు. ఆర్థికంగా అందరికీ సమాన ఫలితాలు అందాలనేది చాలా బలమైన ఆలోచన. ఆశ కంటే అసూయ అత్యంత బలమైన రాజకీయ ఆయుధం. అయితే, వాస్తవాలని హేతుబద్ధంగా విశ్లేషించకపోవటం ఈ మొత్తం చర్చలో లోపం.

1991 నుండి ఈ మూడు దశాబ్దాలలో, భారత్‌లో దిగువనున్న 50 శాతం జనాభా ఆదాయాలు నాలుగు రెట్లు పెరిగాయి. అంతకుముందు కంటే ఎక్కువ ఆదాయాలు, మెరుగైన రహదారులు, విద్యుత్తు, మొబైల్ ఫోన్లు, టెలివిజన్, ఇంటర్‌నెట్, డిజిటల్ బదిలీలు ఎరగని కుటుంబం భారత్‌లో దాదాపు లేదు. కానీ నిజమైన పేదరికం ఇంకా కొనసాగుతోంది. కోట్ల మంది ఇప్పటికీ రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలోనే, రేపేంటి అనే అభద్రతలోనే ఉన్నారు. అటువంటి వాతావరణంలో, తాత్కాలిక వ్యక్తిగత పథకాలకు బలమైన ఆదరణ ఉంటుంది. అయితే సంక్షేమ చర్యలు ఆర్థికంగా ఆచరణసాధ్యంగా ఉండాలి. వచ్చే తరానికి ఆస్తుల్ని నిర్మించకుండా, తాత్కాలిక పథకాల కోసం ఎడాపెడా అప్పులు చేయలేం. సంక్షేమమే పరిపాలన కాకుండా, మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం, పోటీ, అధిక ఆర్థికాభివృద్ధిని జోడించాలి. అప్పుడు మాత్రమే పేదలకు శాశ్వత ప్రాతిపదికన ఆదాయాలు పెరుగుతాయి. పేదరికం తొలగుతుంది. అన్ని వర్గాల ప్రజల జీవన నాణ్యత మెరుగవుతుంది.

కాబట్టి, అసలైన సవాలు “ఇంకా ఇంకా పన్నులు వేసి, పంచటం ఎలా” కాదు; “పేదల ఉత్పాదకతను పెంచటం ఎలా, వారికి నిజమైన అవకాశాన్ని అందించటమెలా”. పేదల్లో అత్యధికులు సంపద సృష్టిలో భాగమయ్యామని భావించనంత వరకూ, అభివృద్ధి నుంచి తమకు అర్థమయ్యేరీతిలో లాభం పొందనంత వరకూ, మన రాజకీయాలు అభివృద్ధికి వ్యతిరేకంగానే సాగుతుంటాయి. ప్రజల్లో ఎక్కువ శాతానికి ఎదిగే అవకాశాలు స్పష్టంగా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ఆర్థికాభివృద్ధికి మెజారిటీ ఓట్లు పడతాయి. కాబట్టి వచ్చే 10-15 సంవత్సరాలు మన ప్రజాస్వామ్యానికి, మన ఆర్థిక వ్యవస్థకి అత్యంత కీలకం.

ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటానికి వీలైన ప్రతిదీ మనం చేయాలి. అభివృద్ధి ఒక్కటే సరిపోదు. ఇప్పటికీ చాలామంది జీవనప్రమాణాలని నిర్ణయించటంలో తలసరి ఆదాయం అత్యంత కీలకమయినది. అధిక అభివృద్ధిని కొనసాగించాలంటే, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రోత్సాహం, నియంత్రణ అడ్డుగోడల తొలగింపు కోసం మనం తదేకంగా కృషి చేయాలి. అభివృద్ధిని వేగవంతం చేసేందుకు, అందులో పేదలకు మరింత సమాన భాగస్వామ్య అవకాశాలు అందించేందుకు నాలుగు కీలక విభాగాల మీద మనం గట్టిగా దృష్టి సారించాలి.

**మొదటిది**, ఉత్పత్తిలో కీలక పాత్ర వహించే భూమి, కార్మిక చట్టాల సంకెళ్లను తొలగించాలి. మరిన్ని పెట్టుబడులు ప్రవహించేలా, మరింత ఉపాధిని సృష్టించేలా చేయాలి. అభివృద్ధికి దన్నుగా నిలిచే కనీస స్థాయి చట్టబద్ధపాలన పరిస్థితుల్ని నెలకొల్పాలి. ఒప్పందాలు సరిగా అమలయ్యేలా చేయటం, వివాదాల్ని వేగంగా పరిష్కరించటం, ప్రయివేటు ఆస్తుల్ని పరిరక్షించటానికి భరోసా కల్పించటానికి వాతావరణం ఉండాలి.

**రెండోది**, మన ప్రజల ఉత్పాదకత, సంపాదనా సామర్థ్యాన్ని పెంచేందుకు జాతీయ స్థాయిలో విద్యారంగంలో ఓ బృహత్తర ప్రయత్నం కావాలి. పిల్లల నమోదు, మౌలిక వసతులు చాలవు, నాణ్యమైన పాఠశాల విద్యాప్రమాణాలు మన మంత్రం కావాలి. ప్రజలకు జేబుఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యం, ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో, ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో అందుబాటులో ఉండాలి.

**మూడోది**, అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు చోదక శక్తులయ్యే 3000 చిన్న పట్టణాల సహజ అభివృద్ధిని ప్రోత్సహించాలి. గ్రామాల మధ్య అటువంటి పట్టణీకరణ వల్ల తక్కువ నైపుణ్యాలున్న కోట్లాది మంది కార్మికులు ఎక్కడో దూరంగా ఉన్న పెద్ద నగరాలకు వలస పోవాల్సిన, అక్కడ ఎటువంటి సామాజిక అండ లేకుండా దుర్భర పరిస్థితుల మధ్య బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన అవసరం లేకుండా ఉపాధి లభిస్తుంది. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అగాధం తొలగాలి, అనుసంధానం పెరగాలి. ప్రభుత్వాలు ఒక్కసారి మౌలిక వసతుల్ని నిర్మించి, పట్టణ ప్రణాళికను నిర్దేశిస్తే చాలు, ఇళ్ల నిర్మాణం, వాణిజ్యం, పరిశ్రమలు వంటివి ప్రయివేటు రంగం చూసుకుంటుంది. చివరిగా, రైతుకి, వినియోగదారునికి మధ్య అడుగడుగునా దళారులు లేకుండా మార్కెట్ గొలుసును కుదించాలి. రిటైల్ చెయిన్లు, పంట ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్, కాంట్రాక్ట్ వ్యవసాయం, ఎగుమతులను ప్రోత్సహించటం ద్వారా వ్యవసాయాన్ని ఆధునీకరించాలి. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించటానికి, అభివృద్ధిని, ప్రగతిని కోరుకునే మెజారిటీని సృష్టించటానికి ఇవన్నీ అవసరం.

# సంస్కరణల కోసం గళమెత్తారు.. మార్పు కోసం కృషి చేశారు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**

జస్టిస్ అంబటి లక్ష్మణరావు గారు విశిష్ట వ్యక్తి. లోక్‌సత్తా ఉద్యమ కార్యకలాపాల్లో లక్ష్మణరావుగారిని కూడా భాగస్వాముల్ని చేయాలని ప్రముఖ పాత్రికేయులొకరు నాకు సూచించారు.

నేను వివరాలు సేకరించినప్పుడు, వేలెత్తి చూపలేని నిజాయతీ, మచ్చలేని ప్రతిష్ట, ఎటువంటి వారినైనా



ఆకట్టుకునే నిరాడంబరత, వినమ్రత అన్నిటినీ మించి ప్రజాహితం కోసం ఆయన తపన, అంకితభావం తెలుసుకున్నాను. ఆయన వద్దకు వెళ్లి అడగ్గానే ఏమాత్రం సంకోచించకుండా లోక్‌సత్తా కార్యక్రమాల్లో పాల్గొనటానికి వెంటనే ఒప్పుకున్నారు.

ఆయన పాల్గొన్న కార్యక్రమాలు, ఉద్యమాలు అన్నీ కూడా గణనీయమైన మార్పులకు దోహదం చేశాయి. దేశాన్ని మెరుగుపరిచే చట్టరూపం దాల్చాయి.

భవనాల క్రమబద్ధీకరణ పథకం సమాచారం బయట పెట్టాలని అవినీతికి వ్యతిరేకంగా మేమిద్దరం ఒక ప్రజా ప్రదర్శనకు నాయకత్వం వహించడం నాకు ఇప్పటికీ గుర్తుంది. విధిలేని పరిస్థితుల్లో అప్పటి కూకట్‌పల్లి మున్సి పాలిటీ ఆ సమాచారం ఇచ్చింది. దరఖాస్తుల ప్రాసెస్‌కి పౌరుల నుంచి వసూలు చేసిన లంచాలన్నీ తిరిగి ఇచ్చేసింది. ఇది సమాచారహక్కు చట్టం రావటానికి కొన్ని సంవత్సరాల ముందు జరిగిన ఉద్యమం. చివరికి జాతీయ సలహామండలి ద్వారా ఆర్‌టీఐ చట్టం రూపకల్పనకు అవకాశం లభించింది. పార్లమెంటు ఏకగ్రీవంగా ఆ చట్టాన్ని ఆమోదించింది.

1999లో జస్టిస్ లక్ష్మణరావు గారు లోక్‌సత్తా ఎన్నికల వాచ్‌కి సారథ్యం వహించారు. ఆ క్రమంలో తీవ్ర నేర చరిత్ర ఉన్న 42మంది అభ్యర్థులను కమిటీ గుర్తించి జాబితాను విడుదల చేసింది. అందులోని పేర్లను ఎవరూ

ప్రశ్నించలేకపోయారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించిన ఆ ప్రక్రియ రాజకీయ వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించింది. దేశ ప్రజల్లో అంతర్లీనంగా ఉన్న మార్పు ఆకాంక్షను రగిల్చింది. చివరికి నేరచరిత్ర సహా తమ వివరాల్ని అభ్యర్థులు తప్పనిసరిగా వెల్లడించడనికి దారి తీసిం ది.

ఒక పరిమితి లోపలి అన్ని సివిల్, క్రిమినల్ కేసుల్లో వేగంగా, అందుబాటులో, సమర్థంగా న్యాయం అందించటానికి లోక్‌సత్తా ప్రతిపాదించిన స్థానిక కోర్టుల నమూనా చట్టాన్ని పలు రంగాల్లో నిపుణులు, న్యాయ కోవిదులతో కలిసి జస్టిస్ లక్ష్మణరావు గారు ఎంతో శ్రమకోర్చి రూపొందించారు. చివరికి ఆ నమూనా చట్టాన్ని అనుసరించి పార్లమెంటు గ్రామ న్యాయాలయాల చట్టాన్ని ఆమోదించింది. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తొలినాళ్లలో శ్రీ లక్ష్మణరావు ఉదారంగా, బేషరతుగా అందించిన మద్దతు, మార్గదర్శకత్వం ఎంతో అమూల్యమైంది. మంచి పౌరసత్వానికి, సంఘటితంగా, అవగాహనతో, శాంతియుతంగా, నిర్మాణాత్మకంగా కార్యాచరణకు ఆయన నిలువెత్తు నిదర్శనం. ఆయన మనల్ని వీడి వెళ్లి పోవచ్చు కానీ ఆయన న్యాయశీలత, నిష్పాక్షిక వ్యవహారశైలి, విలువలు అనేక మంది వ్యక్తులు, సంస్థలలో స్ఫూర్తిని నింపుతూ మార్గదర్శనం చేస్తూనే ఉంటాయి. ఆయన లేనిలోటు పూడ్చ లేనిది..

ఓం శాంతి.

**న్యాయవ్యవస్థ నుంచి బయటకి వచ్చాక**

ప్రజా సంక్షేమం పట్ల జస్టిస్ లక్ష్మణరావు గారికి ఉన్న అంకిత భావం న్యాయవ్యవస్థ నుంచి ఆయన పదవీ విరమణతో ముగిసిపోలేదు. సామాజిక మార్పు కోసం పనిచేయాలనే ఆయన సంకల్పానికి రెట్టించిన ఉత్సాహాన్నిచ్చింది. లోక్‌సత్తా ఎన్నికల సారథిగా ఆయన కృషి సుపరిపాలన, అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాల సాధికారత సాధన పట్ల ఆయనకున్న అంకితభావానికి అద్దం పడతాయి. ప్రజాస్వామ్యానికి బలం కింద, స్థానిక స్థాయి నుంచి మొదలవుతుందనేది ఆయన అచంచల విశ్వాసం. తన నాయకత్వం ద్వారా జస్టిస్ లక్ష్మణరావు గారు పారదర్శకత, జవాబుదారీతనానికి పట్టం కట్టారు. ప్రజాస్వామిక భాగస్వామ్యాన్ని పెంచే ప్రభుత్వ వ్యవస్థల నిబద్ధతను పరిరక్షించే సంస్కరణల కోసం గళమెత్తి పోరాడారు. ★



# నిజాయతీకి నిలువుటద్దం జస్టిస్ లక్ష్మణరావు

జస్టిస్ అంబటి లక్ష్మణరావు నిజాయతీకి నిలువుటద్దమని, మానవతా విలువలతో జీవనం సాగించారని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. ఇటీవల మృతి చెందిన అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు కాపాడటంలో, వ్యవస్థలను బలోపేతం చేయడంలో లక్ష్మణరావు నిర్విరామ కృషి చేశారని పేర్కొన్నారు. నేరచరితులకు టికెట్లు ఇవ్వకూడదని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆనాడు పోరాడిందని అందులో జస్టిస్ లక్ష్మణరావు భాగస్వాములయ్యారని గుర్తు చేసుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ హోదాతో సంబంధం లేకుండా నిరాడంబరంగా ఉండేవారని పేర్కొన్నారు. జస్టిస్ లక్ష్మణరావు పెద్ద కుమారుడు డాక్టర్ రామ్‌పాపారావు తండ్రిని గుర్తు చేసుకుంటూ పలు అంశాలు వివరించారు. ఏ హోదాలో ఉన్నా సామాజిక సేవ, సమాజహితం కోసం కృషి చేయడంతో పాటు సమన్యాయం కోసం తపన పడిన గొప్ప వ్యక్తి జస్టిస్ లక్ష్మణరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన స్వగ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దారని వారు పేర్కొన్నాం. విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ గ్రంథి భవానీ ప్రసాద్, జస్టిస్ రాజ్‌గోపాల్, ఏపీ మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, సీబీఐ రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ హైదరాబాద్ ఛైర్మన్ భీమ్‌రెడ్డి, కిసాన్ ఫోరం నేత సత్యనారాయణ తదితరులు జస్టిస్ అంబటి లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

# న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చిన ఆదర్శప్రాయులు



న్యాయవాద వృత్తిలో 37 సంవత్సరాల పాటు నిజాయతీగా కృషిచేసి 1996లో పదవీ విరమణ పొందిన తర్వాత 28 సంవత్సరాల పాటు సామాజిక సేవ చేసిన మహనీయులు, న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చిన ఆదర్శ ప్రాయులు జస్టిస్ అంబటి లక్ష్మణరావు అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కె. జి. శంకర్ పేర్కొన్నారు. అక్టోబరు 23న గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో జస్టిస్ అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ నిర్వహించారు. పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కె.జి. శంకర్ ప్రసంగిస్తూ జస్టిస్ అంబటి లక్ష్మణరావు వివాదాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని నిర్వహించారని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత ఏ విధమైన గుర్తింపు కోరుకోకుండా సేవా కార్యక్రమాలలో పాలుపంచుకున్నారన్నారు.

శాసన మండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ గత 75 ఏళ్లలో భారత న్యాయవ్యవస్థ స్వర్ణయుగంలో ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తులలో జస్టిస్ లక్ష్మణరావు ఒకరని ప్రశంసించారు. అత్యున్నత ప్రమాణాలను, నిజాయతీని జస్టిస్ లక్ష్మణరావు కొనసాగించారని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత సామాజిక సంస్కరణలు తెచ్చేందుకు లక్ష్మణరావు తోడ్పాటు అందించారని తెలిపారు. పలు సామాజిక కార్యక్రమాలలో 2006 నుండి జస్టిస్ అంబటి లక్ష్మణరావు గారితో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఎన్నికల నిఘా వేదిక ద్వారా పలు సమస్యాత్మక గ్రామాలను సందర్శించి ఓటర్లను చైతన్య పరిచారని తెలిపారు. మద్య నియంత్రణ కమిటీలో చురుకైన పాత్ర పోషించారన్నారు. చేనేత వస్త్రాలను విస్తృతంగా ప్రచారం చేశారని పేర్కొన్నారు. నాన్ రెషిడెన్షియల్ విలేజెస్ అనే భావనను జస్టిస్ లక్ష్మణరావు పరిచయం చేశారని లక్ష్మణ రెడ్డి తెలిపారు. రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి. రామచంద్ర రాజు మాట్లాడుతూ జస్టిస్ లక్ష్మణరావు సంపూర్ణమైన జీవితాన్ని గడిపారని తెలిపారు. విలువలతో కూడిన నిరాడంబర జీవితాన్ని గడిపిన జస్టిస్ అంబటి లక్ష్మణరావు మనందరికీ ఆదర్శ ప్రాయమని తెలిపారు. వారు మనకు అందించిన స్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోయి ఉంటుందని పేర్కొన్నారు.

రెడ్ క్రాస్ చైర్మన్‌గా ఆంధ్రప్రదేశ్ లో విరివిగా బ్లడ్ బ్యాంకులను ఏర్పాటుచేసి రక్తం కొరతను తగ్గించారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ జస్టిస్ అంబటి లక్ష్మణరావు సమాజానికి చేసిన సేవలను గుర్తు పెట్టుకుంటూ వారి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక అంశాలపై స్మారక ఉపన్యాసాలు ఇప్పించాలని కోరారు. ప్రముఖ సేవా తత్పరులు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ప్రసంగిస్తూ జస్టిస్ అంబటి లక్ష్మణరావు తన జన్మభూమి అయిన వెల్లలూరు గ్రామ అభివృద్ధికి విశిష్ట కృషి చేశారన్నారు.

జస్టిస్ అంబటి లక్ష్మణరావు కుమారులు డాక్టర్ రామ్ పాపారావు ప్రసంగిస్తూ నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం తపించేవారని, మరణించేంత వరకు తాను నమ్మిన ఆశయాల అమలు కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మేకల రవీంద్రబాబు, ఉగ్గిరాల సీతా రామయ్య, విశ్రాంత యస్. పి. చక్రపాణి, దాసరి రాము, ఆళ్ల హరి, ఎస్. వి.యస్. లక్ష్మీనారాయణ, పి. ఉమా మహేశ్వరరావు, సోనా వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. సభ ప్రారంభంలో జస్టిస్ అంబటి లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి..
# సుసంపన్న భారత్

**ఐఎంఎఫ్ ఇండియా ఈడీ కృష్ణమూర్తి సుబ్రమణియన్**



**(?) మన ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం 3.9 ట్రిలియన్ డాలర్లు. 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ప్రపంచబ్యాంకు అంచనా. అయితే, 2047 నాటికల్లా 55 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా ఎదుగుతుందని మీరు చెబుతున్నారు. ఎలా సాధ్యమో వివరిస్తారా**

దేశ ఆర్థిక రేటు తెలుసుకోవటానికి డాలర్‌తో రూపాయి మారకం విలువను పోల్చుతాం. గత పాతికేళ్లలో ఏం జరిగిందనేది పరిశీలిస్తే అర్థమవుతుంది. ఉదాహరణకు 1990 నుంచి పరిశీలిస్తే డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏటా 3% నుంచి 3.5% వరకు తగ్గింది. ఇప్పుడు మన దేశ జీడీపీ వృద్ధిరేటు 8%, ద్రవ్యోల్బణం 5% వద్ద ఉన్నాయి. ప్రతి ఆరు సంవత్సరాలకి మన దేశ జీడీపీ రెట్టింపైతే 2047 నాటికి 55 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది. ఈ లక్ష్యానికి చేరాలంటే జీడీపీ వార్షిక వృద్ధిరేటు 8% ఉండేలా చూడటం చాలా ముఖ్యం. దీనికి అనేక సవాళ్లు ఎదురవుతాయి (ఒక ట్రిలియన్ డాలర్లు సుమారు రూ. 83.71 లక్షల కోట్లకు సమానం).

**(?) అలాంటి స్థిర ప్రగతిని రెండు దశాబ్దాలకుపైగా కొనసాగించాలంటే ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది కదా..!**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పాలసీలు అమలు చేయాలి. ఇంకా ఎక్కువగా సంస్కరణలు తేవాలి. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తే అభివృద్ధి పెరుగుతుంది.

**(?) భిన్న వాతావరణం, భౌగోళిక పరిస్థితులున్న రాష్ట్రాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమా**

ఒక నాణేనికి రెండు ముఖాలుంటాయి. రాష్ట్ర పాలకులకు అధికారంతోపాటు బాధ్యత కూడా ఉంటుంది. ప్రస్తుతం అవి బాధ్యతపై అధిక దృష్టిని కేంద్రీకరించాలి. భారత్ 55 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఒక్కో రాష్ట్రం ఒకటి నుంచి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదగాలి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలకు దీన్ని సాధించే అనేక అవకాశాలున్నాయి.

**(?) ఆర్థికాభివృద్ధి అనేక రంగాలతో ముడిపడి ఉంటుంది కదా**

మీకో ఉదాహరణ ఇస్తా. సచిన్ 1993లో ఒక సెంచరీ కొట్టారు. అది చూసి గవాస్కర్.. సచిన్ కెరీర్‌లో 40 సెంచరీలు, 15 వేల పరుగులు చేయకపోతే తాను నిరాశ చెందుతానన్నారు. సచిన్ క్రికెట్‌లో వంద సెంచరీలు చేశారు. దానికి ఆయన ఎంతో కష్టపడ్డారు. ఓపెనింగ్ నుంచి 4వ స్థానంలో కూడా బ్యాటింగ్‌కి వెళ్లారు. చివరకు గవాస్కర్ చెప్పినదానికన్నా ఎక్కువ సెంచరీలు చేశారు. అలాగే మనదేశ ఆర్థిక రంగం వృద్ధి రేటు గత 30 ఏళ్లలో ఎలా పెరిగిందనేది చూసి 2047కి ఎలా మారనుందో నేను చెబుతున్నా.

**(?) రాష్ట్రాలు ఏం చేస్తే అంత వృద్ధి సాకారమవుతుంది**

అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉన్న రంగాలకు నైపుణ్యాలున్న కార్మికులను అందుబాటులో ఉంచాలి. విద్యుత్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలను కల్పించాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా ముఖ్యం. పెట్టుబడులకు అవసరమైన అనుమతులన్నీ సత్వరం ఇవ్వాలి. కేంద్ర బడ్జెట్ వస్తుంటే దేనిపై దృష్టి పెట్టారని అంతా చూస్తారు. అలాగే రాష్ట్రాల బడ్జెట్లలో ప్రజలకు

ఉచితాలు ఇచ్చారా.. సంస్కరణలు తెచ్చారా.. అనేది చూడాలి. ఉదాహరణకు నేను 2009లో అమెరికా నుంచి




వచ్చినప్పుడు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే, గంట, గంటన్నర పట్టేది. ఇప్పుడు రెండు గంటలు పడుతోంది. ఇలా ట్రాఫిక్‌లో సమయం వృధా కావటానికి ఎవరిది బాధ్యత? రాష్ట్రాల బడ్జెట్‌లు వచ్చినప్పుడు ఇలాంటి మౌలిక సదుపాయాల గురించి అడగాలి. ప్రజలకు టీవీ, గ్రైండర్ వంటివి ఉచితంగా ఇవ్వటం కాదు. యువతకు ఉద్యోగాల కల్పన గురించి ఏం పాలసీ తెచ్చారనేది అడగాలి.

**(?) ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు వంటి ప్రతికూల పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతుందా**

1970 నుంచి 1995 మధ్య జపాన్ ఆర్థిక వ్యవస్థ 26 రెట్లు అభివృద్ధి చెందింది. 1970 తర్వాత వియత్నాం యుద్ధం,



ప్రపంచంలో చమురు సంక్షోభం, అమెరికాలో రెండంకెల ద్రవ్యోల్బణమున్నా జపాన్ ఆ ప్రగతి సాధించింది. మనకూ అది సాధ్యమేనన్న సానుకూల దృక్పథం ఉండాలి. గత మూడు దశాబ్దాల భారత ఆర్థికాభివృద్ధిపై ఎంతో పరిశోధన

**తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయి. తలసరి ఆదాయం బాగుంది. యువశక్తి అందుబాటులో ఉంది. ఈ రాష్ట్రాలు లీడ్ తీసుకుని ముందుకెళితే దేశానికి ఉపయోగం. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి నిలపాలి. ఐటీ, పారిశ్రామిక రంగాలను ఆలంబనగా చేసుకోవాలి. పేదరికాన్ని గణనీయంగా తగ్గించాలి. ముఖ్యంగా యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణనిప్పించాలి. అప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఒకటి నుంచి రెండు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు అవకాశముంది.**



చేసి చెబుతున్నా.

**(?) పేదలపై ద్రవోల్బణ ప్రభావం ఎలా ఉంటుంది**

ద్రవ్యోల్బణం పేదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారి కొనుగోలు శక్తి తగ్గుతుంది. అందుకే ధరల తగ్గుదల చాలా అవసరం. 1990 నుంచి మన దేశంలో ద్రవ్యోల్బణం 7% ఉండేది. పాలసీల్లో తెచ్చిన మార్పులతో 2016 నుంచి అదిప్పుడు 5%కి శాతానికి అటూఇటుగా ఉంటోంది.

**(?) చదువుకున్న, నైపుణ్యమున్న యువత ఎక్కువగా విదేశాలకు వెళుతోంది కదా, మన ఆర్థిక రంగానికి అదెలా ఉపయోగపడుతుంది**

1994లో ఐఐటీ నుంచి నేను డిగ్రీ తీసుకున్న సమయంలో నాతోపాటు చదివినవారిలో 80% అమెరికా వెళ్లాం. 2014లో ఐఐటీల్లో చదివినవారిలో 30% మాత్రమే విదేశాలకు వెళ్లారు. రానున్న 25 సంవత్సరాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుంది. జీడీపీ 8% వార్షిక రేటుతో కొనసాగితే ఉద్యోగికి ఆరేళ్లలో జీతం రెట్టింపవుతుంది. అంటే 40 ఏళ్ల కెరీర్‌లో 128 రెట్ల పెరుగుదల కనిపిస్తుంది. అమెరికాలో జీతాలు ఇప్పుడు ఎక్కువగానే ఉన్నా గరిష్టంగా 40 ఏళ్లలో పది రెట్లు మాత్రమే పెరుగుతాయి. అమెరికా వెళ్లి, తిరిగి వచ్చిన అనుభవంతో చెబుతున్నా, ఇక్కడే ఎక్కువ అవకాశాలున్నాయి. ★

**('ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో వెల్లడించిన అభిప్రాయాలు)**

# భారత్ అభివృద్ధికి అవసరం ఆర్థిక నోబెల్ ఆలోచనలు

ఆర్థిక రంగం ప్రధానంగా ప్రజల రోజువారీ జీవితాలకు సంబంధించిందైనా నోబెల్ బహుమతులు ఆ అంశాన్ని విస్మరిస్తున్నాయన్న విమర్శను పరిగణలోకి తీసుకున్నట్లు ఈ ఏడాది రాయల్ స్వీడిష్ అకాడమీ అవార్డును ప్రకటించింది. ఓ దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవస్థల ప్రాధాన్యాన్ని విశ్లేషించిన ముగ్గురు ప్రొఫెసర్లు – మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)కి చెందిన డారెన్ అసిమొగ్లు, సైమన్ జాన్సన్‌లతోపాటు షికాగో యూనివర్సిటీకి చెందిన జేమ్స్ రాబిన్సన్‌లను ఈ ఏడాది నోబెల్ ఆర్థిక బహుమతి లభిం చింది. అసెమొగ్లు, రాబిన్సన్‌లు కలిసి 2012లో 'వై నేషన్స్ ఫెయిల్ – ది ఆరిజన్స్ ఆఫ్ పవర్, ప్రాస్పరిటీ, అండ్ పావర్టీ' పుస్తకాన్ని రచించారు. ఇందులో కొన్ని దేశాలు అభివృద్ధి చెందకపోవటానికి మానవ తప్పిదాలే కారణమని వాదించారు. వలస పాలన, వలస పాలనానంతర దేశాల అభివృద్ధి



నేపథ్యంలో వారు తమ విశ్లేషణను వివరించారు. వలసల్ని పాలించిన దేశాలు నాణ్యమైన వ్యవస్థల్ని నిర్మించుకుని ఎలా ఆర్థికాభివృద్ధి పథంలోకి వెళ్లాయి, వలస పాలన నుంచి విముక్తి చెందిన చాలా దేశాలు అలా నిర్మించుకోకపోవటం వల్ల ఎలా ఆర్థికంగా తీవ్ర ఒడిదుడుకులకు, సంక్షోభానికి గురయ్యాయి వారి అధ్యయనం వెల్లడించింది. ఉదా హరణకు, వలస పాలనానంతర దేశాలు చట్టబద్ధపాలనను శాంతి భద్రతలకు సంబంధించిన అంశంగా, మొక్కుబడిగా మాత్రమే చూడగా, వలస దేశాలు చట్టబద్ధపాలనకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయటం వల్ల ఆస్తి హక్కును పటిష్ఠంగా అమలు చేయగలిగాయి. దీనివల్ల కష్టపడి పనిచేయటానికి, పొదుపు చేయటానికి, పెట్టుబడులు పెట్టటానికి ప్రజలకు తగిన ప్రోత్సాహకం లభించింది. సరైన చట్టబద్ధపాలన కొం˘వడటం, కేంద్రీకృత పాలన, రాజకీయ నిరంకుశత్వం వల్ల ఆ దేశాలు ఆర్థికంగా తీవ్ర ఒడిదుడుకులకు లోనుకాగా, వలస దేశాలు అధికార వికేంద్రీకరణ, బలమైన స్థానిక ప్రభు త్వాలు, రాజకీయ స్వేచ్ఛలతో సంపన్న ఆర్థిక వ్యవస్థల య్యాయి.

ఈ నేపథ్యంలోనే ఒకప్పుడు అత్యంత అభివృద్ధి చెందిన చాలా వలస కాలనీలు ఇప్పుడు నిరుపేద దేశాల సరసన ఉన్నాయి. ఈవేళ దేశాల మధ్య ప్రగతిలో ఉన్న అంతరం వ్యవస్థీకృత పంథాలు, వాటి వల్ల పెరిగిన ఎంపిక స్వేచ్ఛను ప్రభుత్వాలు ఎలా ఉపయోగించుకున్నాయి, వ్యవస్థీకృత భిన్నత్వాలు ఎలా వివిధ రకాల ఫలితాలనిచ్చాయి వంటి చరిత్రాత్మక పరివర్తనల పర్యవసానమే. అసిమొగ్లు అత్యంత ప్రాధాన్యాంశంగా పేర్కొన్నది వలస పాలన స్వభావం గురించి కాదు, అది వ్యవస్థల్ని ఎలా మార్చిందన్నది.

అవార్డు ఎంపిక కమిటీ నిపుణులు ఈ అంశాల్ని ప్రస్తావిస్తూ "చట్టబద్ధపాలన పేలవంగా ఉన్న సమాజాలు, జనాభాను దోపిడీ చేసే సంస్థలు.. అభివృద్ధిని, మెరుగైన మార్పుని సృష్టించలేవని వీరి పరిశోధనలో తేలింది. ఆర్థిక అసమానతల్ని తగ్గించటంలో సామాజిక సంస్థల కీలకపాత్రను వీరు వివరించారు. కొన్ని దేశాలు ఎందుకు ఎదుగుతున్నాయి? మరికొన్ని ఎందుకు విఫలమవు తున్నాయి? అందుకు మూలకారణాలేమిటి? మరింత మెరుగ్గా తెలుసుకోవటానికి ఈ పరిశోధన ఉపయోగ పడుతుంది" అని పేర్కొన్నారు.

అయితే నోబెల్ విజేతల వాదనల్ని కొందరు ఆర్థికవేత్తలు విమర్శిస్తున్నారు. 1970ల కాలం నుండి చైనా, 1990ల తర్వాత భారతదేశం ఆర్థిక సంస్కరణల అమలు ప్రారంభించాక వేగంగా అభివృద్ధి చెందాయని, ఈ దేశాలు వ్యవస్థలను అభివృద్ధి చేసి ఆర్థికాభివృద్ధిని సాధించలేదని, ఇలా కొన్ని దేశాలకు నోబెల్ విజేతల వాదనలు వర్తించవన్నది వీరి విమర్శ. అదేవిధంగా, వలస దేశాల దోపిడీ కూడా ఆక్రమిత దేశాల వెనకబాటుతనానికి కీలకమని, ఈ అంశానికి విజేతల అధ్యయనం పెద్ద ప్రాధాన్యం ఇవ్వలేదని వారు అభిప్రాయపడ్డారు. ఈ విమర్శలున్నా అధ్యయనానికి చాలా ప్రాధాన్యముందనటంలో సందేహం లేదు.

చైనా, భారత్‌లు ఆర్థికాభివృద్ధిని సాధించే క్రమంలో తమ

వ్యవస్థలను మెరుగుపరుచుకున్నాయన్నది వాస్తవం. ముఖ్యంగా చైనా, ఆర్థికాభివృద్ధి అవకాశాలను వినియోగించు కోవటంతోపాటు స్థానిక స్థాయి వరకూ వ్యవస్థలను బలోపేతం చేసుకుంది. విద్య, ఆరోగ్యాలను నాణ్యమైన రీతిలో, ప్రపంచీకరణ అవసరాలతో పోటీపడగల రీతిలో అందించింది. చైనా తరహాలో వ్యవస్థలను బలంగా, సరైన రీతిలో నిర్మించుకోవటం భారత్‌కి అత్యంత కీలకం. కేవలం కలిసొచ్చిన అవకాశాలతో అభివృద్ధికి పరిమితం కాకుండా, అభివృద్ధిని గరిష్ఠ స్థాయిలో సాధించటం, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తట్టుకోగలిగే సుస్థిరాభివృద్ధిగా మలచటం మన దేశానికి ఇప్పుడు ఎంతో అవసరం. అందుకు నోబెల్ విజేతల అధ్యయనం మనకు ఎంతో ఉపయోగపడుతుంది.

### ప్రజాస్వామ్యం అవరోధమా?

చైనా తరహా అభివృద్ధికి భారత్‌కు ప్రజాస్వామ్యం అవరోధమన్న వాదన హేతుబద్ధతకు నిలబడదు. ప్రపంచవ్యాప్తంగా సగటున చూస్తే, ప్రజాస్వామ్యం అత్యంత కనిష్ఠ స్థాయిలో ఉన్నమాట వాస్తవం. వ్యవస్థలు బలహీనపడుతూ తాత్కాలిక తాయిలాలు, నిరంకుశ, వ్యక్తి కేంద్రిత, జనాకర్షక రాజకీయం, పాలన పెచ్చరిల్లున్నాయి. కానీ పరిష్కారం స్వయందిద్దుబాటు శక్తితో, వినూత్నరీతిలో ప్రజాస్వామిక వ్యవస్థల్ని మరింత బలోపేతం చేయటమే. భారత్‌లో ఇప్పటికీ వ్యవస్థల నిర్మాణం సమగ్రంగా జరగనందున, ప్రపంచ దేశాల తాజా అనుభవాలను కూడా పరిశీలించి మనదేశ పరిస్థితులకనుగుణంగా సృజనాత్మకంగా నిర్మించటం అవసరం. ఉపాధి అవకాశాలు, నాణ్యమైన పౌర సేవలు, సామాజిక స్థిరత్వం, అందరికీ ఎదిగే అవకాశాలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన అందించే శక్తి ప్రజాస్వామ్యానికి ఉంది. అందుకు తగ్గ వ్యవస్థలను మన దేశ పరిస్థితులకనుగుణంగా నిర్మించుకోవటంలోనే మనం వెనుకబడ్డాం.

అదేవిధంగా, ఆర్థికాభివృద్ధి క్రమంలో ప్రజాస్వామ్యానికి సవాళ్లు ఎదురవుతాయి. ఆ సవాళ్లను పరిష్కరించుకుంటూ సంపద పెంపొందించుకోవటం ద్వారానే ప్రజాస్వామ్యం వేళ్లానుకుంటూ పరిణతి సాధిస్తుంటుంది. ఆర్థికాభివృద్ధి లేనప్పుడు సమాజం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుకుని ప్రయోజనం ఉండదు. విస్తృత స్థాయి సంపద సృష్టిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలోనే, సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్ర కలిగి, మన దేశంలోని విధానాలు, పద్ధతులపై ఎంతో ప్రభావం చూపిన బ్రిటన్‌లో ప్రజాస్వామ్యాన్ని పారిశ్రామిక విప్లవం ఎంతో ప్రభావితం చేసింది. ఆర్థిక రంగంలో పెనుమార్పులను కారణమై ప్రపంచ చరిత్రనే మలుపు తిప్పిన పారిశ్రామిక విప్లవ కాలం నాటి సాంకేతికత బ్రిటన్‌లో ప్రజాస్వామ్యం పలు సవాళ్లను ఎదుర్కొంది. అదేవిధంగా ఇప్పుడు ఏఐ వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం మరింత సంక్లిష్టమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రజాస్వామ్యం ఎప్పుడూ సంక్లిష్టమైన వ్యవస్థే. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సంస్కరణలను తెస్తేనే అభివృద్ధి గతిని మార్చే సాంకేతికత ఆవిష్కరణలు చేసే స్వేచ్ఛాయుత సమాజం నెలకొంది. అదే సమయంలో ప్రజాస్వామ్య గతిని ఆ ఆవిష్కరణలు ప్రభావితం చేస్తున్నాయని చెబుతున్నారు. అందుకే ఈవేళ ప్రజాస్వామ్యంలో మార్పుల గురించి మాట్లాడేవారు ఎవరైనా సాంకేతిక మార్పులను పరిగణలోకి తీసుకోవాల్సి వస్తోంది. అలా అని చెప్పి ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా టెక్ నాయకులకు, వ్యాపార ధోరణులకు వదిలేయాలనుకోవటం పొరపాటు. ప్రజాస్వామ్యం ఇచ్చిన హామీల్ని నెరవేర్చటానికి అవసరమైన పరిస్థితుల్ని తగిన ప్రోత్సాహకాలతో నిర్మించటం అవసరం. కాబట్టే, ఆర్థిక అభివృద్ధి మాటున దాగిన అనేక లోపాలు మరుగున పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌కి ఈ ఏడాది నోబెల్ విజేతల సందేశం విలువైనది.

> **ఉపాధి అవకాశాలు, నాణ్యమైన పౌర సేవలు, సామాజిక స్థిరత్వం, అందరికీ ఎదిగే అవకాశాలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన అందించే శక్తి ప్రజాస్వామ్యానికి ఉంది. అందుకు తగ్గ వ్యవస్థలను మన దేశ పరిస్థితులకనుగుణంగా నిర్మించుకోవటంలోనే మనం వెనుకబడ్డాం.**

అసమానతలు తొలగిపోవటానికి పరిష్కారాలను ఈ ఏడాది విజేతలు తెలియచేయరు, కానీ సమస్య అసమానతలు కాదు. ప్రజలందరికీ ఎదిగే అవకాశాలు లేకపోవటం. ఇది జరగాలంటే అభివృద్ధి కొందరికే కాకుండా, అందరికీ విస్తరించాలి. ఈ రకమైన సమ్మిళిత అభివృద్ధి కోసం తగిన విధానాలను అనుసరించటం ద్వారా మాత్రమే అందరికీ సమానావకాశాలు సాధ్యమవుతాయి. ఇటీవలి మన ఎన్నికలలో కూడా ప్రజల తీర్పు ఇదే తెలియచెబుతోంది. ఈ సమ్మిళిత అభివృద్ధికి అవసరమైన ఎజెండా అమలు కోసం నోబెల్ విజేతలు సూత్రీకరించిన రీతిలో సమర్థ వ్యవస్థల నిర్మాణం ఎంతో అవసరం. ఈ వ్యవస్థల వల్ల పెరిగిన ఎంపిక స్వేచ్ఛ, వైవిధ్యం, వినూత్నత వంటివి పోటీని పెంచుతూ ఆ విధానాల ఫలితాలను పౌరులకు సమర్థవంతంగా తక్కువ వ్యయంతో అందిస్తాయి. దీర్ఘకాలిక అభివృద్ధి కోసం నోబెల్ విజేతలు పేర్కొన్న అంశాల్లోని నిబంధనలు, పద్ధతులు వంటివి సమాజంలోని మానవ ప్రవర్తనను సరైన దిశలో నిర్దేశించేవని, కొన్ని చట్టాలు ప్రభుత్వ అసంబద్ధ నియంత్రణల నుండి పౌరులను పరిరక్షించేవని, మొత్తంగా ఆర్థికాభివృద్ధిలో కీలక దశలో ఉన్న భారత్‌లో ఆట నియమాల్ని గణనీయంగా మార్చటానికి ఈ ఏడాది ఆర్థిక నోబెల్ విజేతల సూచనలు ఉపయోగపడతాయని విశ్లేషకుల అభిప్రాయం. ★

# సంపద పెంచకపోతే దేశ పురోగతి లేదు

## -నౌరోజీ గారి విమర్శకు సమాధానం-

- వర్షిత్

జయప్రకాశ్ నారాయణ గారు ఆంధ్రజ్యోతిలో రాసిన "సంపద పెంచడం ఎలా" (ఆగస్టు 18) అనే వ్యాసాన్ని విమర్శిస్తూ నౌరోజీగారు "సంపద పెంచితే పేదరికమూ పెరుగుతుంది" (ఆగస్టు 29) అనే శీర్షికతో చేసిన విమర్శ నిర్మాణాత్మకమైనది కాదు. శీర్షిక చదవగానే సంపద పెంచడం తప్పేమో అనే భావన కలుగుతుంది. జయప్రకాశ్ నారాయణ గారు తన వ్యాసంలో సంపద పెరిగితే ఆ ఫలాలు అందరికీ చెందే అవకాశం ఉంటుంది, అలా చెందాలంటే సంపద పెంపులో అందరూ భాగస్వామ్యం అవ్వాలి, అలా భాగస్వామ్యం కల్పించాలంటే ప్రజల ఉత్పాదక సామర్థ్యం, నైపుణ్యాలు పెంచాలి, వాటిని పెంచడానికి దేశ ఆరోగ్య, విద్యా రంగాలు సమర్థంగా పనిచేయాలి అని చెప్పారు. సంపద పెరిగితే అసమానతలు పెరుగుతాయని చెబుతూ, అసమానతలు తగ్గించడానికి పన్నులు పెంచడం, సంపద పన్ను మొదలైన కొత్త పన్నులు విధించడం సరైన మార్గాలు కావని చెప్పారు. ఎందుకంటే, ఆ మార్గంలో దేశం ఇప్పటికే ప్రయాణించి విఫలమయింది. పన్నులు పెంచడం ద్వారా అసమానతలు తగ్గించడమనేది ఒక విఫల భావన. అధిక పన్నులు విధించిన డెబ్భై, ఎనభయ్యవ దశకాలలో హిందూ రేట్ ఆఫ్ గ్రోత్ అని పిలువబడే 3% వృద్ధితో మన ఆర్థిక వ్యవస్థ కుంటుతూ ఉండేది. దేశమంతా బీదరికం తాండవిస్తూ ఉండేది.

1991లో ప్రవేశపెట్టిన సంస్కరణల తర్వాతే ఆర్థికాభివృద్ధి ఏడు నుండి పది శాతం వరకు పెరిగింది. చాలామేరకు దుర్భర దారిద్ర్యం తగ్గింది. దానితోపాటు ఉద్యోగాల కల్పన కూడా పెరిగింది. రొట్టె పరిమాణం పెరిగితేనే దానిని ఎక్కువమందికి పంచగలం. రొట్టే లేకపోతే ఏమి పంచగలం? అంతే కాదు, ప్రజా సంక్షేమంలో ఉచితాల పాత్ర పరిమితమే. అవి ఎల్లకాలం కొనసాగించడం సాధ్యం కాదు. ప్రజలు తమ కాళ్ళపై తాము నిలబడేట్లు చూడడమే అసలైన సంక్షేమం. ప్రజలను సంపద పెంపులో భాగస్వాముల్ని చేయడం ద్వారానే ఆర్థిక అసమానతలు తగ్గుతాయి.

జయప్రకాశ్ నారాయణ గారు సంపద పెంపులో భాగంగా ప్రయివేటు రంగాన్ని అన్ని రకాలుగా ఇతోధికంగా ప్రోత్సహించాలి అని చెప్పారు. మనిషి కష్టపడటానికి లాభం అనేది గొప్ప ప్రేరణ. ఆ ప్రేరణే ప్రయివేటు రంగాన్ని సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతుంది. సమర్థవంతంగా పనిచేయకపోతే ప్రైవేట్ రంగ సంస్థయినా, పబ్లిక్ రంగ సంస్థయినా మూతపడక తప్పదు. ప్రైవేట్ రంగ సంస్థలు మనకు ఇందుకు ఉదాహరణ. అదే పబ్లిక్ రంగ సంస్థల నిర్వహణ అసమర్థంగా ఉన్నా, ప్రభుత్వానికి ప్రజలు చెల్లించిన పన్నులతో అవి నడపబడుతూనే ఉంటాయి. మొన్నటిదాకా యేటా వేలకోట్ల నష్టాలతో అనేక ఏళ్ళు నడపబడిన ఎయిర్ ఇండియా సంస్థ కథ మనందరికీ తెలిసినదే. ఇంకా అనేక పబ్లిక్ రంగ సంస్థలు అసమర్థ నిర్వహణతో నష్టాల్లో నడుస్తున్నాయి.

నౌరోజీగారి విమర్శ ప్రధానంగా, ప్రయివేటు రంగ కార్మికులను, ఉద్యోగులను దోపిడీ చేస్తుంది కాబట్టి దానిని ప్రోత్సహించే చర్యలు ఏవీ చేపట్ట కూడదు. వ్యాపార నిర్వహణ సౌలభ్యం కల్పించకూడదు, కార్మిక చట్టాలు కఠినతరం చేయాలి, వ్యవసాయంలో కార్పొరేట్ల ప్రవేశాన్ని అడ్డుకోవాలి అనే కథనంతో కొనసాగింది. ఈ సందర్భంగా కొన్ని విషయాలు మనం గుర్తుంచుకోవాలి. ఇప్పటివరకు దేశ ఆర్థిక వ్యవస్థలో, ఉపాధి కల్పనలో ముందున్న వ్యవసాయరంగ పాత్ర క్రమేపీ తగ్గుతూ వస్తున్నది. పల్లెల నుండి పట్టణాలకు, నగరాలకు పెరుగుతున్న వలసలు దీనికి తార్కాణం. పట్టణాలు, నగరాల్లోని పారిశ్రామిక, సేవల రంగాలే వీరి ఉపాధికి ఆలంబన. ఇవన్నీ అత్యధిక భాగం ప్రైవేటు రంగంలోనే ఉన్నాయి. ఉపాధి కల్పనలో ప్రయివేటు రంగ వాటా రోజురోజుకి పెరుగుతున్నది. ఉపాధి కల్పనలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగాల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం మొత్తం ఉద్యోగాల్లో, ప్రైవేట్ రంగం వాటా 95% కన్నా ఎక్కువే! ఇందులోనూ ప్రైవేటు వ్యక్తులచే నడపబడుతూ అసంఘటిత రంగంలో వున్న చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) వాటా ఎక్కువ.

ప్రైవేటు రంగంలో లాభాలన్నీ కార్మికులని దోచుకోవటం వల్లనే వస్తాయని భావించటం చాల పొరపాటు. ఆధునిక యుగంలో సంపద పెరిగేది సాంకేతిక విజ్ఞానం వల్లన, కొత్త పుంతలు (ఇన్నోవేషన్) వల్లన కానీ, శ్రమదోపిడి వల్ల కాదు. ఎన్నో రంగాలలో కొత్త టెక్నాలజీలు వచ్చి అటు గౌరవప్రదమైన ఉపాధి కలిగిస్తున్నాయి; ఇటు ప్రజల అవసరాలని అద్భుతంగా తీర్చుతున్నాయి; సమాజంలో సంపద పెంచుతున్నాయి; మనిషి జీవన ప్రమాణాలను పెంచుతున్నాయి. వాక్సిన్లు, ఔషధ పరిశ్రమ, ఆరోగ్య రంగంలో టెక్నాలజీలు, ఐ.టి రంగం,

ఆగ్రిగేటర్లు, ఏ.ఐ. లాంటి రంగాలు సమాజాన్ని నిరంతరం ఉచ్ఛస్థితికి తీసుకెళ్తున్నాయి. ఇవాళ ప్రపంచంలో ఉన్న ఐదు అతి పెద్ద కంపెనీలు గత మూడు, నాలుగు దశాబ్దాల కాలంలో ఆవిర్భవించి, మానవజాతికి అపారమైన మేలు చేసి సంపదని సృష్టించాయి. నిజమైన సంపద సమాజ అవసరాలని తీర్చే వస్తువులని, సేవలని ఉత్పత్తి చేస్తుంది; అది శ్రమ దోపిడి వల్ల రాదు.




ప్రజలకు ఉద్యోగ కల్పనలో ముందున్న ప్రైవేటు రంగాన్ని, ఆ రంగం లాభాపేక్షతో మాత్రమే పనిచేస్తుందన్న కారణంతో ప్రోత్సహించడం మానేయకూడదు. మనదేశంలో, కమ్యూనిస్టు ప్రభుత్వం ఉన్న కేరళ రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాలు కూడా అనేక ప్రోత్సాహకాలను ఇస్తూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాయి. ఇకపోతే పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలలోని కొత్త ఆవిష్కరణలును అందిపుచ్చుకొని వాటిని ప్రజలకు సమర్ధవంతంగా చేరవేసే నూతన సంస్థలు ప్రైవేట్ రంగంలోనే వస్తాయి. దీనికి ఉదాహరణ, ప్రైవేట్ రంగంలో టెక్నోక్రాట్ల ఆధ్వర్యంలో నడపబడుతున్న ఐటీ, ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్. ఇవన్నీ దేశ ఆర్థిక స్వరూపాన్ని మార్చడమే కాకుండా, లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అధిక వేతనాలతో ఉద్యోగుల ఆర్థిక స్థితిగతులు ఎంతో మెరుగుపడ్డాయి. కాబట్టి ప్రైవేట్ రంగాన్ని మనం చిన్న చూపు చూడకూడదు. అయితే వాటిలో పనిచేస్తున్న వారి సంక్షేమం కోసం ఆరాటపడడం సబబే. వారి స్థితిగతులు మెరుగుపరచడం అవసరమే. దానికి, ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడానికి మధ్య వైరుధ్యం ఉన్నదని భావించకూడదు. రెండూ కలిసే ముందుకు సాగాలి. పారిశ్రామిక విప్లవం వచ్చిన తొలి శతా బ్దంలోని కార్మికుల దోపిడీ పరిస్థితులు ఇప్పుడు కూడా ఉన్నాయనే భావనలో మనం వుండకూడదు.

అలానే వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చాలంటే దానిని ఆధునీకరించడం అవసరం. అందుకు పెట్టుబడులు కావాలి. ఇప్పటి వ్యవస్థలు వ్యవసాయానికి కావలసిన పరపతి తగినంతగా కల్పించలేకపోతున్నాయి. పరపతి, పెట్టుబడులు లేక వ్యవసాయ రంగం కునారిల్లుతున్నది. కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా రైతుల పెట్టుబడి సమస్య మార్కెటింగ్ సమస్య రెండూ తీరతాయి. ఇప్పటికే మిర్చి, పొటాటో, టొమాటో మొదలైన పంటల్లో కాంట్రాక్టు వ్యవసాయం జరుగుతున్నది. ఆయా రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడింది. కాంట్రాక్టు వ్యవసాయంతో తమకు మేలు జరగడం లేదనుకుంటే రైతులే దాన్ని వదిలేస్తారు. కార్పొరేట్ రంగం ప్రవేశిస్తుంది అనే కారణంతో కాంట్రాక్టు వ్యవసాయాన్ని వ్యతిరేకించడం సబబు కాదు.

వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు మూడింటిలో ఉత్పాదకత, ఉత్పత్తి రెండూ పెరగాలి. అలా పెరగడంతోనే దేశంలో సంపద పెరుగుతుంది. ఈ మూడు రంగాల్లో పనిచేయడానికి అవసరమైన ఆధునిక విద్య, సాంకేతిక నైపుణ్యం ప్రజలకు అందాలి. అందించాలి అప్పుడే ఆ రంగాలు సమర్ధవంతంగా పనిచేస్తాయి. అంతేకాకుండా, సాంకేతిక నైపుణ్యం గల యువకులు అంకుర సంస్థలు స్థాపించి ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదిగే అవకాశం కలుగుతుంది. అలా ఎదిగిన ఉదాహరణలు కోకొల్లలు. వారి సంస్థలన్నీ ప్రైవేట్ సంస్థలే. వాటి ద్వారానే వారు సంపద సృష్టిస్తారు. అనేక లక్షల మందికి ఉపాధి కల్పిస్తారు. ఒక చిన్న కారు షెడ్డులో కొంతమంది యువ ఇంజనీర్లతో స్థాపించబడి ఇప్పుడు దేశవిదేశాల్లో విస్తరించి, కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ, బిలియన్ల సంపద సృష్టిస్తున్న ఇన్ఫోసిస్ కంపెనీ ఇందుకు ఒక ఉదాహరణ. ఆ సంస్థ ప్రైవేట్ సంస్థ కాబట్టి దానిని స్థాపించిన ప్రమోటర్లు బిలియన్స్ ఆఫ్ డాలర్లు సంపాదించారు కాబట్టి, వారి ఆదాయాలకు, దానిలో పనిచేసే ఉద్యోగుల ఆదాయాలకు మధ్య చాలా అంతరం ఉంది కాబట్టి, అది సృష్టించిన సంపదను, అది దేశానికి చేసిన మేలును, త్రోసిరాజందామా? పిడివాదాలు దేశానికి మేలుచేయవు.


సంపద సృష్టించలేనిదే బీదరికం పోదు. సంపద పెంచకుండా సంక్షేమం సాధ్యం కాదు. సంపద సృష్టిలో సామాన్యులు భాగస్వాములైతేనే వారి ఆదాయాలు పెరుగుతాయి. అలా జరగాలంటే వారికి నైపుణ్యం, ఆరోగ్యం కావాఇ. సంపద సృష్టించాలంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు, స్పెక్యులేషన్ బదులు సంపద సృష్టికి సిద్ధపడే వారిని ప్రోత్సహించే విధానాలు, ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణ అవసరం. ఈ విధానాలు పాటించిన అన్ని దేశాలు సంపదని పెంచి సమాజాన్ని కాపాడుకున్నాయి. పిడివాదంతో ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని, లైసెన్స్ రాజ్యాన్ని నడిపిన దేశాలన్నీ విఫల రాజ్యాలుగా మన కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. ★

# అస్పష్టతలో స్పష్టత హర్యానా ఫలితాలు

ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు తారుమారవటం ఇటీవల మన దేశంలో ఎక్కువైంది. ఇటీవల వెలువడిన హర్యానా ఫలితాలు ఈ అంశాన్ని మరోసారి రుజువు చేశాయి. పోలింగ్‌కు ముందు, తర్వాత నిర్వహించే సర్వేల్లో శాస్త్రీయత కొరవడడమే అంచనాలు గురి తప్పడానికి కారణమనే విమర్శ ఎప్పటి నుంచో ఉంది. అయితే ఒకటిరెండు సంస్థల ఎగ్జిట్‌పోల్సయినా వాస్తవ ఫలితాలకు దగ్గరకు ఉండడంతో ఎగ్జిట్‌పోల్స్ అంచనాలపై ప్రజలు ఇంకా ఆసక్తి చూపు తున్నారు. మన దేశంలో రాజకీయ సర్వేలకు ఇప్పటికీ పరిమితులున్నాయని గుర్తించాలి.

హర్యానా తాజా ఎన్నికలకు సంబంధించి ఇక ప్రధాన అంశాలను పరిశీలిస్తే, గెలు పోటముల కన్నా మన దేశంలో రాజకీయ సంస్కరణల అవసరాన్ని ఎంతో స్పష్టంగా తెలియచెబుతున్నాయి.

ఈసారి హర్యానా ఎన్నికల ఫలితాలపై పలువురు తలపండిన విశ్లేషకులు కూడా పొరబడి ఉండవచ్చుగానీ, ప్రచార సమయంలో అక్కడ పర్యటించిన జర్నలిస్టులు, పరిశీలకులు అందరికీ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. దీనికి తోడు రాహుల్, ప్రియాంకల సభలకు జనం పెద్దసంఖ్యలో హాజరవ్వడం, హర్యానాలో ఆశలు వదిలేసుకోవటం వల్లే ప్రధాని మోదీ మరీ ఎక్కువ ప్రచారం చేయలేదనే విశ్లేషకుల అభిప్రాయాలు...బీజేపీ ఓడిపోనుందనే దానికి మరింత బలం చేకూర్చాయి. కానీ ఫలితాల దగ్గరికొచ్చేసరికి గణనీయమైన తేడా కనిపించింది. ఆప్, స్వరాజ్ పార్టీ వ్యవస్థాపకులు అరవింద్ కేజ్రీవాల్, యోగేంద్ర యాదవ్‌లకు హర్యానా సొంత రాష్ట్రమైనా, అక్కడి రాజకీయ కలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నా వారు కూడా ఫలితం ఇలా తారుమారు కావటాన్ని ఊహించలేకపోయారు. పదేళ్ల పాలన తర్వాత సాధారణంగా ప్రభుత్వం పట్ల ఉండే వ్యతిరేకత, ఓటర్లలో కీలకమైన రైతులు, యువతలో వ్యవసాయ చట్టాలు, అగ్నిపథ్ పథకం వల్ల వ్యతిరేకత, క్షేత్రస్థాయిలో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఇలా రకరకాలుగా బీజేపీ పట్ల వ్యతిరేకత వ్యక్తమైంది. ఇవన్నీ కాంగ్రెస్‌కి పెద్ద అస్త్రాలనటంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో మోదీ బృందం రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ జారవిడవకుండా పోరాడింది. మతాన్ని ఛత్రంగా ఉపయోగిస్తూ, కులవ్యవస్థను కదిలించకుండానే ఆ పరిధిలోనే కులాల మధ్య




అసమానతల్ని, అసంతృప్తుల్ని తొలగించే ప్రయత్నం చేస్తూ సోషల్ ఇంజినీరింగ్‌కి పదును పెట్టింది. ఈ క్రమంలో హర్యానాలో జాట్ వర్సెస్ జాటేతరుల కోణంలో వ్యూహ రచన చేసింది. ప్రజావ్యతిరేకత ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఎన్నికలకు ముందు మార్చి ఓబీసీ నేత నయాబ్ సింగ్ సైనీని నియమించింది. జాటేతరులు, ఓబీసీ, ముస్లిం (పస్మంద) కాంబినేషన్‌తో తన ఓటు బ్యాంకును నిర్మించుకునే ప్రయత్నం చేసింది.

అంతేకాదు సోషల్ ఇంజినీరింగ్‌ని కొంతమేర విద్వేషాలను పెంచేరీతిలో అమలు చేసింది. డేరా బాబా పెరోల్‌పై విడుదలవటం వంటి పరిణామాలు యాదృచ్ఛికం కాదని, ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శించిన టక్కుటమారాది విద్యల్లో భాగమని విశ్లేషకుల అభిప్రాయం. బీజేపీ సోషల్ ఇంజినీరింగ్‌ను మోదీ మార్కు బీజేపీ వ్యూహంగా మాత్రమే కాంగ్రెస్ భావించింది తప్ప దీని ప్రభావాన్ని లోతుగా అంచనా వేయలేకపోయింది.

నిజానికి సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా బీజేపీ అమలు చేస్తున్న ఓబీసీ, జాటేతర, ముస్లిం తదితరుల కాంబినేషన్ వ్యూహం పైకి ఆకర్షణీయంగా కనిపించినా, ఒక పరిధి దాటి ఫలితాలనివ్వదు. ఇది ఒక కులాన్ని రిజర్వేషన్ పరిధిలోకి తెచ్చి మీ సమస్యలన్నిటికీ ఇది పరిష్కారం అని భ్రమింపచేయటం లాంటిది. కచ్చితంగా అణగారిన, వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలి. కానీ ఆటగాళ్లు తప్ప ఆటనియమాలు మారకుండా కేవలం

రాజ్యాధికారం వల్ల ఆ వర్గాలలో ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. ఇది రిజర్వేషన్లు సర్వరోగనివారిణి, ఈడబ్ల్యుఎస్ కోటాతో అగ్రవర్ణాలుగా చెప్పబడుతున్నవారిలో పేదల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పటం లాంటిది. దళితుల్లో కావచ్చు, ఇతర బలహీన, పేద వర్గాల్లో కావచ్చు, రిజర్వేషన్ ఫలాలు కొద్దిమందికే అందుతున్నాయి. దిగువన ఉన్న కోట్లాది మందికి అందటం లేదు. రిజర్వేషన్లు పొందినవారిలో ఎక్కువమంది అగ్రవర్ణాల్లోని అవాంఛనీయ, పెత్తందారీ ధోరణుల్నే అనుకరిస్తున్నారు తప్ప, ఆ కులాల్లోని దిగువన ఉన్నవారికి ఎదిగే అవకాశాల కోసం ప్రయత్నం చేయటం లేదు. ఈ ధోరణి పట్ల 1956లోనే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆవేదనతో హెచ్చరించారు. ఈ వైఖరులే క్రమంగా వర్గీకరణ వంటి డిమాండ్లకు దారితీశాయి. రిజర్వేషన్లు ఆయా కులాల్లో దిగువన ఉన్నవారికి కూడా అందుబాటులో ఉండేలా వర్గీకరణ, ఇతర కొన్ని సంస్కరణల్ని తీసుకురావాలనటంలో సందేహం లేదు. అయితే ఇవన్నీ చేసినా కొద్దిశాతం అవకాశాల మధ్య ఒక పరిధి దాటి ఫలితం రాదు. పూర్తిస్థాయి ఫలితాలు రావాలంటే, నాణ్యమైన విద్య ప్రతి బిడ్డకూ అందించే వ్యవస్థ నిర్మాణం చేయాలి. ఉపాధికి తగిన నైపుణ్యాల్ని, ఉపాధి అవకాశాల్ని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. మనోహర్‌లాల్ ఖట్టర్ హయాంలో హర్యానాలో పాఠశాల విద్యను మెరుగుపరిచేందుకు కొంత ప్రయత్నం జరిగింది. అంతకుముందుతో పోలిస్తే నీతి ఆయోగ్ ర్యాంకింగుల్లో రాష్ట్రం మెరుగుపడింది. అదేవిధంగా బేటీ బచావ్, బేటీ పఢావ్ నినాదంతో బాలికల విద్యను ప్రోత్సహించారు. అయితే ఇప్పటికీ విద్యాప్రమాణాల్లో రాష్ట్రం చాలా చేయాల్సి ఉంది. అదేవిధంగా, ఎక్కువ ఉత్పాదకతను సాధించి, ఎక్కువ ఆదాయాల్ని పొందగలిగేలా మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందించాలి. ఇదేతరహాలో రాజ్యాధికారంలో అణగారిన వర్గాలకు మొక్కుబడి ప్రాతినిధ్యం వల్ల ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశాలు తక్కువ. ఆధిపత్య కులాలుగా పేర్కొనే విభాగంలోనివారు కూడా మౌలిక మార్పులు సాధించిన సందర్భాలు చాలా తక్కువ. ఉన్న వ్యవస్థ పరిధిని దాటి ఆలోచించే ముందుచూపు, ఆటనియమాల్ని మార్చే విధానాలు, వాటిని సాధించే చాతుర్యం కొరవడటం వల్ల వారిలో అత్యధికులు యథాతథస్థితి వలయంలోనే తిరుగుతూ పరిమిత ఫలితాల్ని సాధిస్తున్నారు. ఎప్పుడైనా మౌలిక మార్పులు తెస్తే, పరిస్థితుల ప్రభావం వల్ల సాధించినవే ఎక్కువ. అధికారాన్ని పూజించే సంస్కృతి గల మనలాంటి దేశంలో మొక్కుబడిగా అధికారం లభించినా

**మనోహర్‌లాల్ ఖట్టర్ హయాంలో హర్యానాలో పాఠశాల విద్యను మెరుగుపరిచేందుకు కొంత ప్రయత్నం జరిగింది. అంతకుముందుతో పోలిస్తే నీతి ఆయోగ్ ర్యాంకింగుల్లో రాష్ట్రం మెరుగుపడింది. అదేవిధంగా బేటీ బచావ్, బేటీ పఢావ్ నినాదంతో బాలికల విద్యను ప్రోత్సహించారు. అయితే ఇప్పటికీ విద్యాప్రమాణాల్లో రాష్ట్రం చాలా చేయాల్సి ఉంది. అదేవిధంగా, ఎక్కువ ఉత్పాదకతను సాధించి, ఎక్కువ ఆదాయాల్ని పొందగలిగేలా మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందించాలి.**

గొప్ప అన్నట్లు భావించవచ్చు. కానీ అందువల్ల ఆ వర్గాలకు చెందిన కోట్లాది మందికి వచ్చే లాభమేంటి? అదేవిధంగా దళితుల్లో కంటే ఓబీసీల్లో దిగువన అనేక వర్గాలున్నాయి, వారిలో అనేకమందికి కనీస స్థాయి సాధికారత లేదు, అందువల్ల అధికారంలో వాటాపై బీజేపీ ప్రతిపాదనకు తేలిగ్గా ప్రభావితమయ్యే అవకాశముంది. ఈ లోపాల్ని వివరించి అసమానతలు, కుల జాడ్యంలేని ప్రజాస్వామిక సమాజ నిర్మాణానికి ఆటనియమాలు ఎలా మార్చాలో కాంగ్రెస్ గనక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ప్రకటించి ఉంటే బీజేపీ సోషల్ ఇంజినీరింగ్‌ని బలంగా ఎదుర్కోగలిగేది. ఈ ప్రయత్నం చేయకపోగా, కులగణన విషయంలో కూడా గందరగోళానికి లోనవటం కాంగ్రెస్‌కు హర్యానాలో కొంత నష్టం చేసిందనే వాదనలున్నాయి. తనకు కులం లేదని, కానీ అణగారిన కులాలకు న్యాయం కోసం కులగణన, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలనే డిమాండ్లను చేస్తున్నామని రాహుల్ తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటనలో జార్జిటౌన్ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతూ, భారత్‌లో సమానత్వం నెలకొన్నాక రిజర్వేషన్లను రద్దు చేస్తామని తెలిపారు. మరోవంక, హిందూ మతంలో కులం అనివార్యమన్నట్లు, కులవ్యవస్థ నిర్మూలన తమ లక్ష్యం కాదన్నట్లు బీజేపీ వ్యవహరిస్తూ, ఆ పరిధిలో రిజర్వేషన్లను చూస్తోంది. రిజర్వేషన్లు ఒక నినాదంగా, రాజకీయ ఎత్తుగడగా మాత్రమే ఉన్న దేశంలో నిజమైన చర్చ చేయటం మంచిదే. కానీ రిజర్వేషన్ల ద్వారా అందరికీ న్యాయం ఎలా జరుగుతుందో, కులం ఎలా పోతుందో హేతుబద్ధతకు అందదు. ఈ గందరగోళాన్ని బీజేపీ సమర్థంగా ఉపయోగించుకుని హర్యానాలో

జాటేతరులు, ఓబీసీలు, వారిలోనూ అత్యంత వెనుకబడిన ఎంబీసీలకు మద్దతును గణనీయంగా కూడగట్టగలిగింది. సిటింగ్‌లను తప్పించి మరీ ఈ వర్గాలకు బీజేపీ టికెట్లివ్వగా, కాంగ్రెస్ మాత్రం జాట్‌లకు, సిటింగ్‌లకు ఎక్కువ కేటాయించింది. అదేవిధంగా, కాంగ్రెస్ కులగణన వంటి హామీలు తమ భవిష్యత్తు పట్ల ఎన్నో ఆశలతో ఉన్న యువతకు తిరోగమన ధోరణుల్లా అనిపించి ఆ పార్టీ పట్ల ప్రతికూల భావాన్ని కలిగించాయనే వాదనలు కూడా ఉన్నాయి.

ఇదేసమయంలో, బీజేపీ అభివృద్ధి నమూనా ఇప్పటికీ సమ్మిళితం కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోకి తగినంత విస్తరించలేదు. అక్కడి ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా లేదు. పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతున్నా, ముఖ్యంగా ఢిల్లీ పక్కన ఉండటం వల్ల హర్యానాలో లాంటి చోట మరింత అభివృద్ధి ఉన్నా, అక్కడ స్థానిక ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం వల్ల ప్రజల రోజువారీ జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో పౌర సేవలు అధ్వాన్నంగా ఉన్నాయి. పొట్ట చేత పట్టుకుని వలసల వల్ల వసతుల మీద ఒత్తిడి పెరగటంతోపాటు, చట్టబద్ధపాలన సమస్యలు తలెత్తుతున్నాయి. ఖాప్ పంచాయతీల వల్ల అన్యాయం న్యాయంగా చెలామణి అవుతోంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో రోజువారీ సేవల్ని మెరుగుపరచటం, వార్డు స్థాయి వరకు ప్రజల భాగస్వామ్యంతో సేవలు, నిధుల వినియోగంలో పారదర్శకతను, సామర్థ్యాన్ని పెంచటం, మహిళల భద్రతకు, అణగారిన వర్గాలకు సత్వర, అందుబాటు న్యాయానికి గ్రామన్యాయాలయాల చట్టం అమలుతో స్థానిక కోర్టుల ఏర్పాటు, పెద్ద నైపుణ్యాలు లేని గ్రామీణుల కోసం వారు నివసిస్తున్న ప్రాంతంలోనే చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం వంటి అంశాలను, అభివృద్ధిని విస్తరించటానికి బీజేపీతో పోటాపోటీగా తాము చేపట్టే ఇతర ప్రతిపాదనలతో కలిపి ప్రత్యామ్నాయ నమూనాగా కాంగ్రెస్ ప్రతిపాదించి ఉండాల్సింది.

ఈ నేపథ్యంలో, ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిర్హేతుక ఆరోపణలు చేయటం కాకుండా కాంగ్రెస్ పార్టీ లోతైన సమీక్ష చేసుకోవటం అవసరం. బీజేపీ సోషల్ ఇంజినీరింగ్‌ని ప్రశ్నించకుండా, వారి అభివృద్ధి నమూనాలోని లోపాల్ని తెలియచెప్పి పట్టణ ప్రాంతాల్లో నిలువరించకుండా, గ్రామీణ ప్రాంతాల్లో కట్టడి చేయకుండా, కేవలం ప్రభుత్వ వ్యతిరేకత, తాత్కాలిక వ్యక్తిగత తాయిలాలు, కుల రాజకీయం వంటి వాటితో గెలవటం అసాధ్యమని, యువ ఓటర్లలో ఉన్నకొద్దీ ప్రాచుర్యం కోల్పోవాల్సి వస్తుందని ఇప్పటికైనా గుర్తించాలి. దీనివల్ల ఆరోగ్యకరమైన రాజకీయంతో గెలిచే అవకాశాలు, దీర్ఘకాల భవిష్యత్తు పార్టీకి సమకూరతాయి.

***బీజేపీ కంటే కాంగ్రెస్‌కి కేవలం 0.6% ఓట్లు ఎక్కువ రాగా, సీట్లు మాత్రం 30% ఎక్కువ వచ్చాయి. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, తక్కువ వచ్చిన వారి ఓట్లన్నీ వృథాయే అనే ఎన్నికల వ్యవస్థ వల్ల కొద్దిశాతం ఓట్ల కోసం కూడా విపరీత ప్రయాస పడాల్సిన అవసరం లేకుండా, ప్రతి ఓటుకూ విలువ ఉండేలా ఎన్నికల సంస్కరణలు తీసుకు రావటం మేలు.***

బీజేపీ ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించినా, విజయం సాధించాక అభివృద్ధి, సుపరిపాలన అంశాలను ప్రస్తావించినా, ఎన్నికల ప్రచారంలో కులాన్ని ప్రజల మధ్య విభజన పెంచే రీతిలో ఉపయోగించింది. దీంతోపాటు ప్రచారంలో అధికారాన్ని కొంతమేర దుర్వినియోగం చేసిందనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ ఆ బాటలో నడవకుండా పంథా మార్చు కోవాల్సిన అవసర ముంది.

రెండు ప్రధాన జాతీయ పార్టీలూ ఎన్నికల్లో గెలుపు కోసం చివరి వరకూ జీవన్మరణ పోరాటంలా తలపడ్డాయి. ఓట్ల శాతంలో పెద్ద తేడా లేకున్నా, ఒకరు గెలిచారు, ఒకరు ఓడారు. బీజేపీకి 39.94% ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 39.09% వచ్చాయి. విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టి ఇలా తలపడటం, ఆ తర్వాత అధికార పార్టీలోకి ఫిరాయింపుల వల్ల కాలక్రమంలో అన్ని పార్టీలూ అలసిపోవాల్సి ఉంటుంది. మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా, బీజేపీ కంటే కాంగ్రెస్‌కి కేవలం 0.6% ఓట్లు ఎక్కువ రాగా, సీట్లు మాత్రం 30% ఎక్కువ వచ్చాయి. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, తక్కువ వచ్చిన వారి ఓట్లన్నీ వృథాయే అనే ఎన్నికల వ్యవస్థ వల్ల కొద్దిశాతం ఓట్ల కోసం కూడా విపరీత ప్రయాస పడాల్సిన అవసరం లేకుండా, ప్రతి ఓటుకూ విలువ ఉండేలా ఎన్నికల సంస్కరణలు తీసుకు రావటం మేలు. ఆర్థికాభివృద్ధి అందరికీ అందేలా నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, చట్టబద్ధ పాలన, ఎన్నికల్లో కోట్ల రూపాయల అక్రమ వ్యయం లేకుండా దామాషా ఎన్నికల పద్ధతి, స్థానిక ప్రభుత్వాల సాధికారత మొదలైన అంశాలపై దృష్టి సారించాలి. దేశానికి అవసరమైన, నిర్మాణాత్మకమైన ఈ రకమైన ఎజెండాలో పోటీపడి ప్రత్యామ్నాయ విధానాలతో గెలిచేందుకు ప్రయత్నించాలి. గెలుపోటములతో సంబంధం లేకుండా అన్ని పార్టీలకూ హర్యానా ఎన్నికల పాఠమిది. ★

# 2036 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ



తెలంగాణ స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) 2036 నాటికి ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్) పేర్కొంది. ప్రస్తుత జీఎస్‌డీపీ 176 బిలియన్ డాలర్లుగా ఉందని, వచ్చే 12 ఏళ్లలో అది భారీగా వృద్ధి చెందుతుందని వెల్లడించింది. దేశ జీడీపీలో ప్రస్తుతం తెలంగాణ వాటా 4.9% ఉండగా, 202 నాటికి 7.73 శాతానికి, 2036 నాటికి 9.3 శాతానికి చేరుకుంటుందని వివరించింది. 140 కోట్ల దేశ జనాభాలో కేవలం 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ అద్వితీయంగా పురోగమిస్తోందని పేర్కొంది. తలసరి ఆదాయం విషయంలోనూ రాష్ట్రం దూసుకెళ్తోందని తెలిపింది. అంతర్జాతీయ కృత్రిమ మేధ (ఏఐ) సదస్సు సందర్భంగా ప్రపంచ వాణిజ్య కేంద్రం 'ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ పయనం' పేరిట నివేదికను ఇటీవల విడుదల చేసింది. శంషాబాద్‌లో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు అంతర్జాతీయ వాణిజ్య కేంద్రాల సంఘంలో సభ్యత్వం ఉంది. నివేదికలోని ముఖ్యాంశాలివి:

WORLD TRADE CENTER
SHAMSHABAD

☞ ప్రస్తుతం దేశ తలసరి ఆదాయం 2,485 డాలర్లు కాగా, తెలంగాణ తలసరి ఆదాయం 4,160 డాలర్లు. తెలంగాణ తలసరి ఆదాయం 12,690 డాలర్లకు చేరుకుంటుంది. గత పదేళ్లలో తెలంగాణ 12.5% రేటుతో వృద్ధి రేటుతో దేశంలో అగ్రభాగాన నిలిచింది.

☞ తెలంగాణలో ఉన్న నైపుణ్య మానవ వనరులు, పెరుగుతున్న అంకురాలు, వినూత్న ఆవిష్కరణలు, అనుకూల జీవన పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, పర్యావరణ వ్యవస్థ, అందుబాటులో స్థిరాస్తి రంగం వంటివి అభివృద్ధి కి దోహదపడుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక ఇంజిన్‌కు సేవారంగం చోదకశక్తిగా ఉంది. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

☞ 2036 నాటికి, ఉత్పత్తి సేవల పరంగా అగ్రగామిగా ఎదిగిన ఐటీ రంగం, ప్రపంచ సామర్థ్యాల కేంద్రాల (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్) వాటా 460 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది.

☞ 2040 నాటికి ఒక్క వ్యవసాయ రంగం వాటా 703 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది.

**భారీగా ఉపాధి అవకాశాలు:**

**ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ ద్వారా కంపెనీలు భారీగా లబ్ధి పొందటంతోపాటు యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అదేస్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు వృద్ధి చెందుతాయి. తయారీరంగమూ విలువ ఆధారితంగా మారుతుంది.**

☞ అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు ఇరుగుపొరుగు రాష్ట్రాల్లోని ఓడరేవులు వంటి రవాణా వ్యవస్థలు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి.

☞ ఫ్యూచర్ సిటీ, నైపుణ్య విశ్వవిద్యాలయం, ప్రాంతీయ రింగ్ రోడ్, మూసీ నది పునరుద్ధరణ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తున్నాయి.

☞ తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో బహుముఖ అభివృద్ధి, అనుసంధాన వ్యవస్థ, గృహనిర్మాణం, నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటివి పారిశ్రామిక ప్రగతికి దోహదం చేస్తాయి. ★

# స్థానిక సంస్థలను బలోపేతం చేయాలి

## -తెలంగాణ ఆర్థిక సంఘం నివేదిక-

తెలంగాణలోని నగర పాలక సంస్థలు, పురపాలికలు, జిల్లా, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఆదాయ మార్గాలు పెంచి ఆర్థికంగా బలోపేతం చేయాలని జాతీయ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక సంఘం కోరింది. ఇందుకు అవసరమైన కార్యాచరణను నివేదించింది. రాష్ట్రంలో 12,750 గ్రామ పంచాయతీలు, 538 మండల పరిషత్‌లు, 32 జిల్లా పరిషత్‌లు కలిపి మొత్తం 13,320 గ్రామీణ స్థానిక సంస్థలున్నాయి. నగరాలు, పట్టణాలకు సంబంధించి 13 నగర పాలక సంస్థలు, 130 పురపాలికలు ఉన్నాయి. వీటి బలోపేతానికి అవసరమైన సలహాలు, సూచనలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం చర్చించింది. వివిధ రాష్ట్రాల్లోని స్థానిక సంస్థలపై అధ్యయనం చేసింది. మరోవైపు సామాజిక అధ్యయనాల సంస్థ (సెస్), అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి)లతోనూ అధ్యయనం చేయించి నివేదికను రూపొందించింది. దీన్ని ఆర్థిక సంఘానికి ఇటీవల సమర్పించింది.

**నివేదికలోని సూచనలు**

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఆరోగ్యంతోపాటు నాణ్యమైన విద్య అందించాలి. స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలి. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. హరిత ఇంధనాన్ని పెంచాలి. పరిశ్రమలు, నూతన ఆవిష్కరణలు, మౌలిక వసతులు పెరగాలి. సామాజిక అసమానతలను దూరం చేయాలి. నాణ్యమైన ఉత్పత్తులు ఉత్పత్తి చేయాలి. మెరుగైన సేవలందించాలి. పాలన, సేవల్లో ప్రజాభాగస్వామ్యం పెరగాలి.



**గ్రామీణ స్థానిక సంస్థల్లో..**

రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థల పరిధిలో 40 శాతం జలవనరులు ఉన్నాయి. మత్స్యరంగ పరిధిలో అభివృద్ధికి వీటిని వినియోగించుకోవాలి. జాతరలు, పండుగలు, సంతలు, ఉత్సవాల ద్వారా ఆదాయం వస్తుంది. ఆబాది, గ్రామకంతం భూముల రిజిస్ట్రేషన్ ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేయాలి. రూ.30 లక్షల నుంచి 50 లక్షల వరకు స్వయంసహాయక బృందాలకు సంఘాలకు రుణసాయం అందించి కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. పంటలు, ఇతర ఉత్పత్తులను శుద్ధి చేసి వాటి విలువలను పెంచి అదనపు ఆదాయం ఆర్జించాలి. ఉపాధి హామీ ద్వారా అదనపు ఆస్తులు, వనరులను సృష్టించాలి.



**నగర స్థానిక సంస్థల్లో..**

నగరాలు, పట్టణాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. హైదరాబాద్ మహానగరం (జీహెచ్ఎంసీ) అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి. పట్టణ స్థానిక సంస్థల్లో వనరులను పెంపొందించాలి. ఆదాయం పెంపుదలతోపాటు సేవలు మెరుగుపడాలి. మూలధనం పెంపుదలకు పెట్టుబడులను ఆకర్షించాలి. ఆదాయ సమీకరణకు కొత్త మార్గాలను అన్వేషించాలి. సముచిత రీతిలో నిధులు, విధులు, యంత్రాంగం బదలాయింపులు జరగాలి. కార్పొరేటు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద వంద కోట్లను సమీకరించే వెసులుబాటు ఉంది. పర్యవేక్షణ నియంత్రణ, డేటా సమీకరణ (స్కాడా)ను సాంకేతిక బదిలీకి వినియోగించాలి. ఖర్చులు పారదర్శకంగా ఉండాలి. నగరాలు, పట్టణ ప్రాంతాలలో వృత్తిపన్ను వసూలు పకడ్బందీగా జరగాలి. 80 శాతం ఆదాయం ప్రైవేటు సంస్థల ద్వారా వచ్చే వీలున్నా వసూలు చేయకపోవడంవల్ల ఆదాయం కోల్పోతున్నాయి. వీటిని విధిగా వసూలు చేయాలి. వాణిజ్య పన్నులు, సీవరేజి, వ్యాపార లైసెన్సులతోపాటు ఆస్తి పన్నును హేతుబద్ధీకరించాలి.

**అధికారాల బదిలీ ప్రక్రియ**

స్థానిక సంస్థలకు సంబంధించి అధికారాల బదలాయింపు

ప్రక్రియపై ప్రక్రియ పైనా రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదికను అందచేసింది. దీని ప్రకారం.. రాజ్యాంగం 11 వ షెడ్యూల్‌లోని మొత్తం 29 గ్రామీణ స్థానిక సంస్థల అధికారాల్లో 11, 12వ షెడ్యూల్‌లోని నగర స్థానిక సంస్థల అధికారాల్లో 18కిగాను 17 బదలాయించినట్లు తెలిపింది. విధుల బదలాయింపులో ఆరో ర్యాంకులో, యంత్రాంగం బదలాయింపులో 12వ ర్యాంకులో, ఈ నిధుల బదలాయింపులో నాలుగో ర్యాంకులో రాష్ట్రం ఉన్నట్లు వెల్లడించింది. స్థానిక సంస్థలకు అధికారాల బదలాయింపునకు సంబంధించి దేశం మొత్తం మీద అయిదో ర్యాంకులో నిలిచినట్లు రాష్ట్ర ఆర్థిక సంఘం వెల్లడించింది. తలసరి ఆదాయం రూ.2,25,047 (జాతీయ సగటు రూ.1.4 లక్షలు) కాగా, రాష్ట్ర పన్నుల వాటా 7.5 శాతం (జాతీయ సగటు 6.3) గా ఉందని, తెలంగాణ నగరీకరణ 31.1 శాతంగా ఉందని పేర్కొంది.

**ఐడియాథాన్ ద్వారా కొత్త ఆలోచనలు**

స్థానిక సంస్థల బలోపేతానికి బలోపేతం కోసం వినూత్న ఆలోచనలను ఐడియాథాన్-2024 నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం ఆన్‌లైన్‌లో ఆహ్వానించింది. 1,100 కి పైగా ఆలోచనలు వారికి వచ్చాయి. వాటిని పరిశీలించి అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా తుది జాబితా ఎంపిక చేశారు. ★

# ఎస్.సి, ఎస్.టిలపై అకృత్యాలు: తెలంగాణలో రోజుకు సగటున ఆరు కేసులు

తెలంగాణలో ఎస్.సి, ఎస్.టిలపై వేధింపులు పెరుగుతూనే ఉన్నాయని, సామాజిక దురాచారాలతో సాటి మనుషులపై దూషణలు, దాడులు, హత్యాయత్నాలు, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని తాజా నివేదికలో వెల్లడైంది.

ఎస్.సి, ఎస్.టిలపై వేధింపుల నియంత్రణ చట్టం కింద తెలంగాణలో రోజుకి సగటున ఆరు కేసులు నమోదవుతున్నాయి. ఒక్క ఏడాదిలోనే 2,254 కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా రాష్ట్రం తొమ్మిదో స్థానంలో ఉంది. 2022 ఏడాదికి సంబంధించి ఎస్.సి, ఎస్.టి కేసులు, న్యాయ విచారణ, పరిహారం తదితర అంశాలపై యూనియన్ సామాజిక న్యాయశాఖ నివేదిక విడుదల చేసింది. 2022 నాటికి న్యాయస్థానాలలో 8,230 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది.

ప్రత్యేక న్యాయస్థానాలు లేవు

☆ 2022లో ఎస్.సి, ఎస్.టి వేధింపుల నియంత్రణ చట్టం కింద 2,254 కేసులు నమోదయ్యాయి. ఎస్.సిలపై వేధింపుల కేసులు 1,725 ఉంటే, ఎస్.టిలపై 529 ఉన్నాయి.

☆ రాష్ట్రంలో అట్రాసిటీ దాడులకు అవకాశమున్న 74 గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. ఇందులో నిజామాబాద్, రామగుండం పోలీసు కమిషనరేట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధిక గ్రామాలు ఉన్నాయి.

☆ ఎస్.సి, ఎస్.టిలపై వేధింపుల కేసులను వేగంగా విచారించేందుకు జిలల్లాకు ఒటకటి లేదా అంతకు ఎక్కు ప్రత్యేక కోర్టులు ఏరాపటు చేయాలి. తెలంగాణలో కోర్టుకు ప్రస్తుతం 33 జిల్లాలకు కేవలం 10 జిల్లాల్లో మాత్రమే ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. ఏపీలో 26 జిల్లాలకు ఒక్క జిల్లాలో మాత్రమే ప్రత్యేక కోర్టు నడుస్తోంది.

☆ 2020 నుంచి 2022 వరకు పరిశీలిస్తే దేశవ్యాప్తంగా అట్రాసిటీ కేసులు 53,886 నుంచి 62,601 కి పెరిగాయి. కోర్టుల్లో పెండింగ్ శాతం 96.4 శాతం నుంచి 94.1 శాతానికి తగ్గింది. శిక్షల శాతం 39.2 నుంచి 32.4 శాతానికి తగ్గినట్లు వెల్లడైంది.

☆ ఆంధ్రప్రదేశ్‌లో 2,569 కేసులతో దేశంలో ఏడో స్థానంలో ఉంది. ఎస్.సిలపై వేధింపులకు పాల్పడిన కేసుల సంఖ్య 2,130గా ఉంటే, ఎస్.టిలపై వేధింపుల కేసులు 379 ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో ఎస్.సిలపై వేధింపులు ఎక్కువ

☆ ఎస్.సిలపై దాడులు, వేధింపులకు సంబంధించి 2022లో దేశవ్యాప్తంగా మొత్తం 52,866 కేసులు నమోదవగా, ఉత్తరప్రదేశ్ 12,287 కేసులతో మొదటిస్థానంలో ఉంది. రాజస్థాన్ 8,651, మధ్యప్రదేశ్ 7,732 కేసులతో రెండు, మూడు స్థానాలలో ఉన్నాయి.

☆ ఎస్.టిలపై వేధింపులు మధ్యదేశ్‌లో అధికంగా జరిగాయి. దేశంలో మొత్తం 9,735 కేసుల్లో మధ్యప్రదేశ్‌లో నమోదైనవి 2,979. ఆ తర్వాత రాజస్థాన్ 2,409. ఒడిశా 773 ఉన్నాయి.

# ఆర్థిక సంఘానికి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాల సూచనలు




బీజేపీయేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు 16వ ఆర్థిక సంఘానికి ప్రభుత్వపరంగా తమ విజ్ఞప్తులను అందించే సమయంలో కొన్ని నిర్దిష్ట అంశాలపై ఫిర్యాదులు చేస్తూ మార్పుల్ని ప్రతిపాదించాయి. దాంతోపాటు గతంలో ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్రాల స్వతంత్ర ధోరణులను పటిష్ఠం చేయటానికి ఎన్.టి రామారావు చొరవ తీసుకుని కరుణానిధి, రామకృష్ణ హెగ్డే, బిజూపట్నాయక్ తదితరుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన కాంక్లేవ్‌ల తరహా సమావేశాల్ని నిర్వహిస్తున్నాయి. దేశంలో ఫెడరలిజాన్ని గణనీయంగా బలోపేతం చేసి రాష్ట్రాలను శక్తిమంతం చేసిన నాటి కాంక్లేవ్‌ల స్థాయిలో కాకున్నా, తమ గొంతును బలంగా వినిపించేందుకు ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లోని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఎన్‌టిఆర్, తదితర నాయకుల కృషి వల్ల, ఈవేళ ఒక రాష్ట్రం అభివృద్ధి చెందినా, అంతంతమాత్రంగా ఉన్నా, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా ప్రధానంగా అది ఆ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి తీరు మీద, అక్కడ అప్పుచేసి పప్పుకూడు తరహాలో తాత్కాలిక వ్యక్తిగత తాయిలాల్ని పంచటం మీద ఎక్కువ ఆధారపడి ఉంటోంది. పద్నాలుగవ ఆర్థిక సంఘం సిఫార్సుల వల్ల యూనియన్ ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు బదిలీ అవుతున్న నిధుల వాటాను 32 నుండి 42 శాతానికి పెరిగినప్పటికీ, సెస్సులు వగైరాలతో యూనియన్ ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని ఆరోపిస్తున్నాయి. దాంతోపాటు కొవిడ్ సమయంలో లాక్‌డౌన్ వల్ల వనరుల పంపిణీలో కొన్ని ఒడిదుడుకులు, జీఎస్‌టీ ఇంకా కుదురుకోకపోవటం వంటి కారణాల నేపథ్యంలో నెలకొన్న గందరగోళానికి కొంత రాజకీయం తోడవటం విమర్శలు పెరిగాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతకుముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వంపై చేసిన తరహా విమర్శలనే ఇప్పుడు ప్రతిపక్షాలు చేస్తున్నాయి. కాకపోతే, మోదీ వ్యవహారశైలి వల్ల తీవ్రత కొంత పెరిగింది. సహకార ఫెడరలిజం విధానంలో పనిచేస్తున్నట్లు మోదీ ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణ అందుకు విరుద్ధంగా ఉందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనికితోడు మోదీ ప్రభుత్వం వాస్తవాల్ని వివరించి నచ్చచెప్పే ధోరణిని ప్రదర్శించకుండా ఉదాసీన వైఖరిని అవలంబించటంతో ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది. ఆర్థిక తోడ్పాటు కోసం తమ డిమాండ్లను బలంగా వినిపించే హక్కు రాష్ట్రాలకుంది. అదే విధంగా సెస్సుల్లో వాటా వంటి అభ్యంతరాలు చర్చనీయాంశాలు. ఈ నేపథ్యంలో మనం రాష్ట్రాల వాదనను పరిశీలించాలి. రాష్ట్రాలు న్యాయమైన వాటాను సాధించటానికి తగిన మద్దతివ్వాలి.

తెలంగాణ ప్రతిపాదనల్ని పరిశీలిస్తే బీజేపీయేతర మిగిలిన రాష్ట్రాల విజ్ఞప్తుల గురించి కూడా మనకు స్పష్టత వస్తుంది. రాష్ట్ర పరిధిలోని ప్రాజెక్టులకు సంబంధించిన అభ్యర్థనలను మినహాయిస్తే ఆర్థిక సంఘానికి ఇచ్చిన విజ్ఞప్తులు చాలావరకు అన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఒకే విధంగా ఉన్నాయి.

**తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు, ప్రతిపాదనల్లోని ముఖ్యాంశాలు:**

⏭ కేంద్ర ప్రాయోజిత పథకాలు రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి అవరోధంగా ఉన్నాయి. కఠినమైన నిబంధనలు, మ్యాచింగ్ గ్రాంట్‌ల షరతులు రాష్ట్ర బడ్జెట్‌లను ప్రభావితం చేస్తున్నాయి. యూనియన్ ప్రభుత్వ షరతుల మేరకు రాష్ట్రాలు తమ సొంత వనరుల నుంచి నిధులు కేటాయించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్రాల్లోని ప్రాధాన్య రంగాల నుంచి నిధులు మళ్లుతున్నాయి.

⏭ పద్నాలుగవ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు జాతీయ స్థాయి ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు పన్నుల వాటాను 42 శాతానికి

పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ మొత్తం పన్నుల ఆదాయాల్ని లెక్కేస్తే పది శాతం దాకా తక్కువ ఉంటోంది. ఆ సిఫార్సు నిబంధనలను సరళతరం చేసిందే తప్ప వనరులలో నిజమైన పెరుగుదల లేదు. సెస్సులు, సర్‌ఛార్జీల్లో వాటాను యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాలతో పంచుకోవటం లేదు. వాటిపై ఆధారపడటం వల్ల యూనియన్ ప్రభుత్వ స్థూల పన్ను ఆదాయం 28 శాతానికి పెరిగింది. జీఎస్‌టీ పరిహారంలో తీవ్ర జాప్యం వల్ల రాష్ట్రాల ఆర్థికస్థితి దెబ్బతింటోంది. రాష్ట్రాలు సామర్థ్యాని కనుగుణంగా బడ్జెట్‌లను రూపొందించు కోలేకపోతున్నాయి. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తోంది.

⏭ ఈ నేపథ్యంలో, జాతీయ స్థాయి ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు పన్నుల వాటాను 41 నుంచి 50% కి పెంచాలి. సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు, స్థానిక సంస్థల అభివృద్ధికి వాటా ఇవ్వాలంటే సెస్సులు, సర్‌ఛార్జీల నిధుల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.

⏭ రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 50%కి పెంచితే దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న ఎన్‌డీయే ప్రభుత్వ లక్ష్య సాధనకు మేం సంపూర్ణంగా సహకరిస్తాం. భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చటంలో మా వంతు బాధ్యతను నెరవేరుస్తాం. తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. ఆర్థిక సహకార ఫెడరలిజాన్ని బలోపేతం చేయటంలో ఆర్థిక సంఘం మద్దతును కోరుతున్నాం.

⏭ తెలంగాణ తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నా సంపద, ఆదాయ పంపిణీలో గణనీయమైన అసమానతలున్నాయి. వీటిని తగ్గించటానికి మౌలిక సదుపాయాలు, సంక్షేమంపై గణనీయ వ్యయం అవసరం. తలసరి ఆదాయం ఒక్కటే కాకుండా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ని కూడా పరిగణలోకి తీసుకుని కేంద్రం నిధులివ్వాలి. అలా చేస్తే ఉత్పాదకతను మెరుగు పరచటానికి, పెట్టుబడులను ఆకర్షించటానికి, ఉద్యో గాలను సృష్టించటానికి అవకాశం ఉంటుంది. దీనివల్ల భారత దేశం 2027-28 నాటికి 5 ట్రిలియన్, 2047 నాటికి 30 ట్రిలి యన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే కేంద్ర లక్ష్యం నెరవేరు తుంది.

⏭ రుణాల పునర్వ్యవస్థీకరణకు మద్దతివ్వాలి

⏭ విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాతీ య స్థాయి సహాయాన్ని కొనసాగించాలని రాష్ట్రం తరపున విజ్ఞప్తి చేస్తున్నాం. వాతావరణ మార్పులతో అస్థిరమైన రుతు పవనాలు తరచుగా వచ్చే కరవులు తెలంగాణను దెబ్బ తీస్తున్నాయి.

⏭ దక్షిణాది రాష్ట్రాలు జనాభాలో 19.6 శాతం మాత్రమే ఉన్నప్పటికీ జీడీపీలో 30 శాతం సమకూరుస్తూ గణనీయమైన సహకారం అందిస్తున్నాయి. అయినా పన్నుల పంపిణీలో వారి వాటాను 21.073 నుంచి 15.800 శాతానికి ఫైనాన్స్ కమిషన్ తగ్గించింది. 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతుంది. జాతీయ నిర్ణయాధికారంలో వారి రాజకీయ ప్రాధాన్యం తగ్గుతుంది. దీనిని నివారించాలి. జనాభా నియంత్రణ, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిన రాష్ట్రాలు అన్యాయంగా జరిమానాకు గురయ్యే అవకాశం ఉంది. ఒక శతాబ్దంలో సభలో ప్రతినిధుల సంఖ్య గరిష్టంగా 435గా నిర్ణయించిన అమెరికా విధానాన్ని భారత్ అనుసరించాలి.

**ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి హరీష్‌రావు ఓ వ్యాసంలో చేసిన కొన్ని సూచనలు:**

⏭ పన్నుల వాటాగా రాష్ట్రాలకు బదిలీ చేసే డబ్బు కన్నా రెండు మూడు రెట్లు ఎక్కువగా కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు బదిలీ చేస్తున్నారు.

కేంద్ర ప్రాయోజిత పథకాలు కార్యక్రమాలు

2015-16లో పన్నుల వాటాగా రాష్ట్రాలకు బదిలీ చేసిన రూ. 84,579 కోట్లకు రెట్టింపుకి పైగా రూ. 1,75,736 కోట్లను కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా బదిలీ చేశారు. అదేవిధంగా, 2024-25లో ఆర్థిక సంఘం నిధులు రూ. 1,32,378 కోట్లు మాత్రమే కాగా, కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ. 4,79,605 కోట్లను బదిలీ చేశారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు చాలావరకు రాష్ట్రాల పరిధిలోని అంశాలకు సంబంధించినవే కావటంతో రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఈ నిధుల బదిలీ ఉంటోంది.

⏭ ప్రతి అయిదేళ్లకోసారి ఆర్థిక సంఘం కాలవ్యవధిలో కేంద్ర ప్రాయోజిత పథకాలను సమీక్షించాలని నిర్ణయించినా ఇంకా అమలు జరగటం లేదు

⏭ రాష్ట్రాల ఆదాయంలో 80 శాతం వరకు పన్నుల ద్వారానే సమకూరుతోంది. ప్రస్తుతం పన్నుల వసూళ్లలో నిబద్ధతను పాటించే రాష్ట్రాలకు 2.5 శాతంగా మాత్రమే ఇస్తున్న వెయిటేజిని 10 శాతానికి పెంచాలి. గతంలో ఆర్థిక సంఘం, జనాభా నియంత్రణకు కేటాయించిన 12.5 శాతం వెయిటేజీని 16వ ఆర్థిక సంఘం కూడా కొనసాగించాలి.

⏭ స్థానిక సంస్థలకు నిధులను 50 శాతానికి పెంచటంతోపాటు వాటిని 80 శాతం జనాభా, 20 శాతం విస్తీర్ణం ప్రాతిపదికన ఇవ్వాలి. గత ఆర్థిక సంఘం 90 శాతం జనాభాను ప్రాతిపదికగా చేసుకోవటంతో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నిధులు లభించాయి. 40 శాతం వరకు పట్టణ ప్రాంతా లున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు తక్కువ నిధులు లభించాయి.

⏭ రాష్ట్ర విపత్తు నిధిని 15వ ఆర్థిక సంఘం 100 శాతం పెంచింది. ప్రస్తుతం కనీసం 60 శాతం పెంచాలి. విపత్తు నిధిలో రాష్ట్రాలు 10 శాతం మాత్రమే చెల్లించాలని, మిగిలిన 90 శాతం కేంద్రం సమకూర్చాలని 14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసినప్పటికీ యూనియన్ అమలు చేయలేదు. ✪

# సాగువ్యయంపై విస్తృత సర్వే



- ❖ నమూనా గ్రామాల సంఖ్య రెట్టింపు
- ❖ ఖర్చుతోపాటు మూడేళ్ల దిగుబడుల వివరాలూ సేకరణ
- ❖ వీటి ఆధారంగానే ఎగుమతులు, దిగుమతులపైనా నిర్ణయాలు

వాతావరణంలో అసాధారణ మార్పుల కారణంగా వ్యవసాయంలో పంట దిగుబడుల అంచనాలు తలకిందులు అవుతున్నాయి. దాంతో పంటల సాగుకు, మద్దతు ధరలకు మధ్య పొంతన ఉండటం లేదు. తుపాన్లు, కరవుల సమయంలో పంట నష్టపరిహారం చెల్లింపులూ రైతుల అవసరాలను తీర్చటం లేదు. విదేశాలకు ఎగుమతి చేయాల్సిన, అక్కడి నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పంటల దిగుబడులపై స్పష్టత ఉండటం లేదు. ఈ నేపథ్యంలో యూనియన్ ప్రభుత్వం చేస్తున్న పంటల వ్యయాల సర్వేకు ఈసారి దిగుబడుల అంచనాలను జోడించింది. సర్వే నిర్వహించే గ్రామాలు, నమూనాల



సంఖ్యనూ పెంచింది. వివరాలు..

జాతీయ వ్యవసాయ, వ్యయ ధరల కమిషన్ (సీఏసీపీ) 1970-71 నుంచి ప్రతీయేటా రాష్ట్రాలవారీ విశ్వ విద్యాలయాలు, ఇతర ప్రభుత్వ యంత్రాంగాల్లోని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో అన్ని పంటల సాగువ్యయంపై సర్వే చేయించి, వాటి నివేదికల ఆధారంగా మద్దతు ధరల (ఎంఎస్‌పీ) పై నిర్ణయం తీసుకుంటోంది. తెలంగాణలో వరి, పత్తి, మొక్కజొన్న, శనగ, మిర్చి, కందులు, వేరుశెనగ, నువ్వులు, సోయాబీన్ పంటల సాగు ఖర్చులపై రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సర్వే బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇప్పటికే 26 నమూనా మండలాల్లో ఒక్కో గ్రామంలో 10 మంది చొప్పున మొత్తం 260 మంది రైతులను ఎంపిక చేసి అధ్యయనం చేశారు. ఈ సర్వేలో లోపాలు ఉండటంతో దీని పరిధిని మరింత విస్తరించాలని నిర్ణయించారు. గతంలో 26 మండలాల్లో ఒక్కో గ్రామం ఎంపిక చేయగా.. ఇకపై రెండేసి గ్రామాల్లో అంటే మొత్తం 52 గ్రామాల్లో సర్వే జరుగుతుంది. ఒక్కో గ్రామంలో ఆరుగురు రైతుల చొప్పున మొత్తం 312 మందితో అధ్యయనం చేస్తారు.

**దిగుబడుల హెచ్చుతగ్గులపైనా సర్వే**

గతంలో సర్వే పంటల సాగువ్యయాలకే పరిమితమయ్యేది. ఇకపై కృషి పరపేక్షక సర్వే (కేపీఎస్) విధానంలో పంటల దిగుబడుల హెచ్చుతగ్గులను సైతం అంచనా వేయాలని యూనియన్ నిర్ణయించింది. క్షేత్రస్థాయి సిబ్బంది.. ఎంపిక చేసిన రైతులు వేసిన పంటల దిగుబడులలో హెచ్చుతగ్గుల వివరాలను సేకరిస్తారు. గత రెండు మూడేళ్లతోపాటు ప్రస్తుత సంవత్సర సంవత్సరం పంటల దిగుబడి ఎలా ఉందో తెలుసుకుంటారు. ఈ నివేదికలను క్రోడీకరించి, దేశవ్యాప్తంగా ఆయా పంటల దిగుబడులు పెరిగితే యూనియన్ ప్రభుత్వం వాటి ఎగుమతులకు అవకాశం కల్పిస్తుంది. తగ్గితే ఎగుమతులను నిషేధిస్తుంది.

**ఎం- ట్రాకర్‌తో నిరంతర నిఘా**

గతంలో సర్వే చేస్తున్న వారిపై నిఘా ఉండేది కాదు. ఇకపై ఎం-ట్రాకర్ పేరిట అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వారి సర్వేను ప్రవేశపెట్టనున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది.. తాము రైతులతో మాట్లాడిన వివరాలను వెబ్ ఆధారిత సిస్టం ద్వారా ఫార్మాస్ (ఫార్మర్ ఎనాలిసిస్ ప్యాకేజి) 2.0లో నమోదు చేస్తున్న వీడియోలను ఆన్‌లైన్‌లో హైదరాబాద్‌కు

పంపించాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని పర్యవేక్షక అధికారులు సైతం సంబంధిత రైతులతోనూ మాట్లాడి నిర్ధారించుకుంటారు.

**మూడేళ్లపాటు 26 మండలాల్లో సర్వే**

**తెలంగాణలో 2026 సంవత్సరం వరకు**

**జోన్-1:** ఉత్తర తెలంగాణలో తాంసి, సిర్పుర్ (యు), కొడిమ్యాల, బోయిన్‌పల్లి, బీర్కూరు, భిక్కనూరు, మాచారెడ్డి, జక్రాన్‌పల్లి.

**జోన్-2:** సెంట్రల్ తెలంగాణలో జహీరాబాద్, పుల్కల్, కోహీర్, నిజాంపేట, నర్మెట్ట, ముదిగొండ, కేసముద్రం, అశ్వారావుపేట.

**జోన్-3:** దక్షిణ తెలంగాణలో వనపర్తి, వీపనగండ్ల, గద్వాల, పెద్దఊర, మాడుగులపల్లి, నడిగూడెం, మట్టంపల్లి, కొల్లాపూర్, యాచారం, షాబాద్.

# వరిలో తెలంగాణ టాప్



- **దిగుబడిలో దేశంలోనే ప్రథమ స్థానం**
- **2023-24లో దేశంలో పంట ఉత్పత్తులు 3,322.98 లక్షల టన్నులు**
- **అంతకుముందు ఏడాది కంటే అధికం**
- **తుది అంచనాలను విడుదల చేసిన యూనియన్**

వరి దిగుబడిలో తెలంగాణ సత్తా చాటింది. 2023-24లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే పత్తిలో 3, పొద్దుతిరుగుడులో 4, మొక్కజొన్న, చిరుధాన్యాలలో 5వ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పొగాకులో 2, మినుము, ఆముదంలో 3, జొన్న, వేరుసెనగ దిగుబడుల్లో 5 స్థానాలను సాధించింది. ఈ మేరకు దేశంలో ప్రధాన పంటల దిగుబడుల తుది అంచనాలను యూనియన్ వ్యవసాయ శాఖ విడుదల చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ అంచనాలను రూపొందించింది. రిమోట్ సెన్సింగ్, ప్రతి వారం రూపొందించే క్రాప్ వెదర్‌వాచ్ గ్రూప్, ఇతర ఏజెన్సీల నుంచి వచ్చిన సమాచారాన్ని సరిపోల్చుకుని తుది అంచనాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ప్రధాన పంటల దిగుబడులు రికార్డుస్థాయిలో వచ్చినట్లు పేర్కొంది.

**26.11 లక్షల టన్నులు అధికం**

దేశవ్యాప్తంగా 2023-24లో 3,322.98 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. 2022-23 నాటి తుది అంచనాలతో పోలిస్తే ఇది 26.11 లక్షల టన్నులు అధికం. పంటలవారీగా వరి 20.70 లక్షలు, గోధుమ 27.38 లక్షలు, చిరుధాన్యాలు 2.51 లక్షల టన్నుల మేర ఉత్పత్తులు పెరిగాయి. 2023-24లో దక్షిణాది రాష్ట్రాలు, మహారాష్ట్రల్లో కరవు లాంటి పరిస్థితులు, రాజస్థాన్‌లో సుదీర్ఘ వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల పప్పుదినుసులు, సోయాబీన్, పత్తి వంటి పంటలపై ప్రభావం చూపినట్లు యూనియన్ ప్రభుత్వం తెలిపింది.


- 2023-24లో 168.74 లక్షల టన్నుల వరి దిగుబడితో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. గత అయిదేళ్లలో రాష్ట్రం సాధించిన వరి దిగుబడుల్లో ఇదే అత్యధికం. తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్ (159.90 లక్షల టన్నులు), పశ్చిమ బెంగాల్ (156.87 లక్షల టన్నులు), పంజాబ్ (143.56), ఛత్తీస్‌గఢ్ (97.03) నిలిచాయి.
- ఏపీలో వరి దిగుబడి 73.42 లక్షల టన్నులకు పరిమితమైంది. గత అయిదేళ్లలో ఇదే అతి తక్కువ.
- తెలంగాణలో మొక్కజొన్న 27.79 లక్షలు, చిరుధాన్యాలు 199.15 లక్షలు, పొద్దుతిరుగుడు 0.15 లక్షల టన్నుల దిగుబడులు లభించాయి. రాష్ట్రం 50.80 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తిని సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో మినుము 3.45 లక్షలు, వేరుసెనగ 3.23 లక్షల టన్నులు దిగుబడులు లభించాయి. ఏపీ 2 లక్షల టన్నుల పొగాకు దిగుబడిని సాధించింది. కంది దిగుబడులకు సంబంధించి దేశవ్యాప్తంగా 34.17 లక్షల టన్నులు సాధించగా, తెలంగాణలో 1.45 లక్షలు, ఏపీలో 0.96 లక్షల టన్నులు లభించింది. శనగ దిగుబడి దేశంలో 110.39 లక్షల టన్నులు కాగా, ఏపీలో 3 లక్షలు, తెలంగాణలో 1.64 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది.

# సిటిజన్ చార్టర్లు 2.0

పల్లె ప్రజలకు సమస్త సేవలందించేందుకు సిటిజన్ చార్టర్ (పౌర సేవల పట్టిక) 2.0ను ప్రవేశపెట్టేందుకు యూనియన్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రజలకు నిర్ణీత వ్యవధిలో సేవలు అందించటం, వారి ఫిర్యాదులను పరిష్కరించటం దీని లక్ష్యం. 6,40,930 గ్రామ పంచాయతీల్లో అమలుకు జాతీయ స్థాయి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలనూ సిద్ధం చేస్తోంది. దేశంలో తొలిసారిగా 1997లో సిటిజన్ చార్టర్ మొదలైంది. దీని ద్వారా నిర్ణీత వ్యవధిలో పౌర సేవలు అందించే విధానం అమల్లోకి వచ్చింది. నగరాలు, పట్టణాలతో పోలిస్తే పల్లెలకు సరైన సేవలు అందటం లేదని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. సాంకేతికత విస్తరించినా గ్రామ పంచాయతీలు దాన్ని అందిపుచ్చుకోవటం లేదు. మొత్తం పౌర సేవల్లో 28 శాతమే ఆన్‌లైన్‌లో అందుతుండగా, 72 శాతం ఆఫ్‌లైన్‌లో ఉన్నాయి. రుసుములు, చెల్లింపులు, ధ్రువీకరణ పత్రాలు తదితరాల కోసం పల్లెవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం పల్లెల ముంగిటకు సేవల అందుబాటులోకి తెచ్చేందుకు సిటిజన్ ఛార్టర్ 2.0 అమల్లోకి తేవాలని నిర్ణయించింది.

**దేశంలో ఇలా..**

**గుజరాత్, మహారాష్ట్ర, త్రిపుర, కేరళ , రాజస్థాన్ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలు మెరుగ్గా అందుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ వంటివి ఇందులో వెనుకంజలో ఉన్నాయి.**




**వివిధ దేశాల్లో**

**అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి డిజిటల్ పబ్లిక్ గూడ్స్ పేరిట బంగ్లాదేశ్ (యాక్సెస్ టు ఇన్ఫర్మేషన్), ఇథియోపియా (మాడ్యులర్ ఓపెన్ సోర్స్ ఐడెంటిటీ ప్లాట్‌ఫాం), మొజాంబిక్ (మాడ్యులర్ ఓపెన్‌సోర్స్ ప్లాట్‌ఫాం), మొజాంబిక్ (డిజిట్), శ్రీలంక (డీహెచ్ఐఎస్ 2), ఫిలిప్పిన్స్ (ఓపెన్ జీ2పీ) వంటి దేశాల్లో గ్రామీణ ప్రజలకు పౌర సేవలను అందిస్తున్నారు.**

### తెలంగాణలోనే తక్కువ సేవలు

**ఉత్తరప్రదేశ్‌లోని గ్రామాల్లో 216 రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 70, కర్ణాటకలో 89, గుజరాత్‌లో 54, తమిళనాడులో 44, అస్సాం, హిమాచల్‌ప్రదేశ్‌లలో 42 చొప్పున, జార్ఖండ్‌లో 40, హర్యానాలో 32ఆన్‌లైన్ సేవలందుతున్నాయి. తెలంగాణలో మాత్రం 21 సేవలే అందుతున్నాయి. దేశవ్యాప్తంగా పలు పంచాయతీల్లో నగదు రహిత (డిజిటల్) చెల్లింపులు జరుగుతున్నాయి. తెలంగాణలో ఇంకా అమల్లోకి రాలేదు. తెలంగాణలో తండాలను, చిన్న గ్రామాలను కూడా పంచాయతీలుగా ప్రకటించి సంఖ్యను పెంచటం, నిధుల్ని కేటాయించకపోవటం ఇందుకు ఒక ప్రధాన కారణం. దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్ సేవలు అందించేందుకు యూనియన్ ప్రభుత్వం 2016 నుంచి సాయం అందిస్తోంది. కంప్యూటర్లు మంజూరు చేస్తోంది. భారత్‌నెట్ పథకం కింద ఆప్టికల్ ఫైబర్ లైన్ వేసి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు సిద్ధమైంది. కానీ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తెలంగాణలో మొత్తం 12,769 పంచాయతీల్లో 6,176 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. మిగిలినవాటిలో 1200 శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో రాష్ట్రంలోని 2,049 పంచాయతీలకు మాత్రమే యూనియన్ ప్రభుత్వం కంప్యూటర్లు మంజూరు చేసింది.**

**కార్యాచరణ ఇలా..**

సిటిజన్ చార్టర్ 2.0 కోసం యూనియన్ పంచాయతీరాజ్ శాఖ కార్యాచరణ చేపట్టింది. "నా పంచాయతీ, నా అధికారం – మా ఇంటి వద్దకు ప్రజా సేవలు (మేరీ పంచాయత్, మేరీ అధికార్– జన్ సేవాయే హమారా ద్వార్) పేరిట కార్యక్రమం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసేందుకు జాతీయస్థాయిలో ప్రాంతీయ వర్క్‌షాపులు నిర్వహించనుంది. హైదరాబాద్‌లోని జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణావృద్ధి సంస్థ (ఎన్‌ఐఆర్‌డీ)లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాలతో ఇటీవల మొదటి వర్క్‌షాప్ జరిగింది.



**పంచాయతీల డిజిటలీకరణ**


సిటిజన్ చార్టర్ల అమలు కోసం దేశంలోని ప్రతి గ్రామ పంచాయతీకి పక్కా భవనం ఉండాలి. భవన నిర్మాణాల కోసం యూనియన్ నిధులు ఇస్తుంది. గ్రామ పంచాయతీలకు కంప్యూటర్లను అందచేస్తుంది. భారత్ నెట్‌వర్క్ లేదా రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో సాయంతో ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌ను, ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కల్పిస్తుంది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఆన్‌లైన్ సర్వీస్ డెలివరీ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ప్రతి పంచాయతలో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమిస్తారు. లేదా ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి కంప్యూటర్ శిక్షణనిస్తారు. ✪

## పంచాయతీల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం చేయూత

దేశంలోని గ్రామ పంచాయతీల ప్రగతికి యూనియన్ ప్రభుత్వం అన్ని విధాలా చేయూత అందిస్తుందని జాతీయ పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ తెలిపారు. 'అట్టడుగు స్థాయి వరకు మెరుగైన సేవలు.. జీవన సౌలభ్యం' అంశంపై యూనియన్ పంచాయతీరాజ్ శాఖ హైదరాబాద్ ఎన్‌ఐఆర్‌డీలో నిర్వహించిన ప్రాంతీయ పంచాయతీ సదస్సులో మాట్లాడుతూ, "ప్రజలకు మెరుగైన, సత్వర సేవలందించేందుకు పంచాయతీలు కృషి చేయాలి. కావాల్సిన మెరుగైన పరిజ్ఞానం, కార్యాచరణ వ్యూహాల అమలు, ఆదర్శ విధానాలను పాటించాలి. క్షేత్రస్థాయిలో డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు యూనియన్ ప్రభుత్వం సహకరిస్తుంది" అని చెప్పారు. క్షేత్రస్థాయిలో సానుకూల మార్పును తీసుకురావాల్సిన బాధ్యత పంచాయతీ ప్రతినిధులు, అధికారులపై ఉందని ఎన్‌ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ అన్నారు. అత్యాధునిక పరికరాలు, సాంకేతికతతో సన్నద్ధం చేయటం ద్వారా పరిపాలనలో పెద్ద మార్పులకి రంగం సిద్ధమవుతోందన్నారు.


## ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా

# నాణ్యమైన పౌర సేవలు అందాలి




గ్రామ పంచాయతీల్లో పౌర సేవలను మెరుగుపరిచే క్రమంలో యూనియిన్ ప్రభుత్వం సిటిజన్ చార్టర్ వ్యవస్థను తీసుకురావాలని ప్రయత్నించటం స్వాగతించదగ్గ విషయం. ఈ చట్టాన్ని దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సాంకేతికత వినియోగం ద్వారా అమలు చేయటానికి జాతీయ స్థాయి ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. సిటిజన్ చార్టర్లకు తోడు పౌర సేవలకు గ్యారంటీ ఇచ్చేలా, ఒకవేళ నిర్ణీత వ్యవధిలో అమలు చేయకుంటే రోజుకు ఇంత చొప్పున పరిహారం చెల్లించేలా సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో యూనియన్ ప్రభుత్వం నేరుగా అమలు చేయటానికి చట్టాన్ని 2013లో అప్పటి యూనియన్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు లోక్‌సత్తా రూపొందించి అందచేసింది. హక్కుగా పౌర సేవల కోసం రూపొందించిన ఆ చట్టాన్ని రెండు బిల్లుల రూపంలో లోక్‌సత్తా తయారుచేసింది. ఒకటి నేరుగా అందించే సేవలకు, ఇంకోటి ఎలక్ట్రానిక్ సేవలకు సంబంధించి. అయితే అప్పటి లోక్‌సభ కాలం ముగియటంతో ఆ బిల్లులు మురిగిపోయాయి. ఆ తర్వాత మోదీ ప్రభుత్వం వచ్చాక, ఆ నమూనా చట్టాన్ని కొంత మెరుగుపరిచి ఒకే బిల్లుగా 2014లో అందచేసింది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు కొన్ని మార్పులతో అందచేసింది. తెలంగాణలో ఈ చట్ట నమూనాలోని కొన్ని అంశాలను పట్టణ ప్రాంతాల్లో అమలు చేయగా, ఏపీలో పారిశ్రామిక వర్గాలకు మాత్రమే వర్తింపచేశారు. కాలక్రమంలో తెలంగాణలో సిటిజన్ చార్టర్లు ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాల్లో నోటీసు బోర్డులకే పరిమితమయ్యాయి. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా ప్రభుత్వ సేవల్లో లంచాలు, వేధింపులు కొనసాగుతున్నాయి.

హక్కుగా పౌర సేవల చట్టం కోసం ఉద్యమాన్ని లోక్‌సత్తా 1997 నుంచి ప్రారంభించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకునేకన్నా అక్కడ సక్రమంగా సేవలు పొందటం ఎంతో కీలకం. ఈ క్రమంలోనే పాలనా సమాచార హక్కు చట్టాన్ని తానే రూపొందించినప్పటికీ ఆ చట్టం కన్నా సర్వీస్ గ్యారంటీ/ పౌర సేవల చట్టం విప్లవాత్మకమైనదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ చెబుతుంటారు. 1997లో లోక్‌సత్తాను ప్రారంభించిన వెంటనే మొదటి ఉద్యమ కార్యక్రమంగా 'స్వరాజ్యం' పేరుతో పౌర సేవల పట్టికను రూపొందించి విడుదల చేశారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏయే సేవలను, ఏ రకంగా అందించాలి, వాటిని హక్కుగా ఎలా పొందాలి తెలియచేసేలా అందులో వివిధ ప్రభుత్వ సేవల వివరాల్ని పొందుపరిచారు. ఆ పౌర సేవల పట్టిక ద్వారానే తొలి కార్యక్రమంగా పెట్రోల్ బంకుల్లో కొలతల మోసాన్ని నిబంధనల్లోని ఒక సాధారణ అంశంతో మోసాన్ని అరికట్టింది. నూటికి నూరు శాతం రాజ్యాంగబద్ధంగా పౌర ఉద్యమాన్ని నిర్మించింది. దీనివల్ల కొలతల్లో మోసాలు



తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పరిశ్రమల కేంద్రం - కరీంనగర్ జిల్లా

## సిటిజన్ చార్టర్

| అందించే సేవలు | కాలపరిమితి |
|---|---|
| 1. ఉద్యోగ్ ఆధార్ మెమొరాండం (ONLINE MSME UAM) వెబ్‌సైట్ అడ్రస్ : http://udyogaadhaar.gov.in | 1 రోజు లో |
| 2. రాయితీలకు సంబంధింతిన సిఫారసులు (SLC) జిల్లా పరిధి రాయితీల (DLC) మంజూరికై (Incentives) | 30 రోజులు |
| 3. ముడి సరుకుల కొరకై సిఫారసులు (Raw Materials) | 15 రోజులు |
| 4. PMEGP ప్రధాన మంత్రి ఉపాధి హామి పథకం క్రింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడును (వెబ్ సైట్ అడ్రస్ : http://kvionline.gov.in) | 30 రోజులు |
| 5. ఇతర ఫిర్యాదుల పరిష్కారములు | 15 రోజులు |

6. TSiPASS పథకము క్రింద వివిధ రకాల ప్రభుత్వ అనుమతులకై ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు తగు సమాచారం, సలహాలు మరియు సూచనలు ఇవ్వబడును.
http://ipass.telangana.gov.in

| s.no | Department Name | Approval Name | Time limit |
|---|---|---|---|
| 1 | TSNPDCL | Power Connection (Fesability & Estimation) | 12 Days - upto 33 KVA<br>25 Days - above 33 KVA |
| 2 | TS Pollution Control Board | CFE & CFO NOC From PCB | 7 Days - Green<br>14 Days - Orange<br>21 Days - Red |
| 3 | Factories Department | Factory Plan Approval(CFE)<br>Factory License (CFO) | 7 Days<br>7 Days |
| 4 | DTCP/HMDA/SUDA/KUDA | Industrial Building Plan Approval | 7 Days - DTCP<br>14 Days - SUDA / HMDA |
| 5 | Revenue Department | NALA (Land Conversation) | 14 Days |

ఒక్కసారిగా అదుపులోకి వచ్చాయి. ఇప్పటివరకు దేశంలో ఈ రకంగా పౌరులకు సుమారు పది లక్షల కోట్లు ఆదా అయినట్లు అంచనా. స్వరాజ్యం పుస్తకం పలు పునర్ముద్రణలు పొంది తెలుగు మార్కెట్‌లో రికార్డుస్థాయిలో అమ్ముడైంది. అయితే ఆ సమాచారం ఆధారంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి తమకు అవసరమైన సేవను నిబంధనల ప్రకారం పొందటం చాలా తక్కువమందికి మాత్రమే సాధ్యమయ్యేది. అందువల్ల ఒక చట్టపరమైన ఏర్పాటు అవసరమని గుర్తించి, బ్రిటన్‌లో 1991–92లో జాన్ మేజర్ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన తరహాలో సిటిజన్ చార్టర్లను గ్యారంటీ, పరిహారంతో తెచ్చేందుకు నమూనా చట్టాన్ని లోక్‌సత్తా రూపొందించింది. 2001లో అప్పటి ఏపీ ప్రభుత్వం గుంటూరు, తణుకు, కుత్బుల్లాపూర్ మునిసిపాలిటీల్లో పైలట్ ప్రాజెక్టుగా వాటిని అమలు చేసింది. ఏ పనికి ఎంత సమయం పడుతుందో అక్కడి మునిసిపల్ కార్యాలయాల్లో సిటిజన్ చార్టర్ల బోర్డు ఏర్పాటు చేసి ఆ ప్రకారం సకాలంలో పని పూర్తి చేయకపోతే దరఖాస్తు చేసిన ప్రజలకు కొంత పరిహారం చెల్లించేవారు. ప్రజల్లో ప్రచారం కోసం లోక్‌సత్తా కూడా కొంత మొత్తాన్ని ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి జత చేసి ఇచ్చింది. అయితే ప్రభుత్వం నుంచి తగిన ప్రచారం, చట్టబద్ధ ఏర్పాటు లేకపోవటంతో క్రమంగా అవి నామమాత్రమయ్యాయి. ఆ తర్వాత చట్టాన్ని మెరుగుపరిచి ప్రజల్లో అవగాహన

**పౌరునికి అవసరమైన అన్ని రకాల సేవలకూ ఆన్‌లైన్‌ను సాధ్యమైనంతమేర విస్తరించటం, అవినీతి లేకుండా అందించటం, రాబోయే కాలంలో ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా సేవలు అందించటం ప్రభుత్వం తీసుకొచ్చే మార్పుల లక్ష్యం కావాలి.**

పెంచటంతోపాటు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తోంది. ఈ క్రమంలోనే యూనియన్ ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చే ప్రయత్నాన్ని స్వాగతిస్తోంది.

మొత్తం ఆరు లక్షలకు పైగా ఉన్న అన్ని రకాల ఆవాసాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిచోటా అన్ని సేవలూ సాధ్యం కాకుంటే పంచాయతీల క్లస్టర్ల ప్రాతిపదికన కొన్ని ప్రాధాన్య సేవలను అక్కడ నుంచి సేవలను నిర్వహించవచ్చు. అదేసమయంలో పట్టణ ప్రాంతాల్లో కూడా సిటిజన్ చార్టర్లను పటిష్ఠం చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలకు నమూనాలా ఉండే చట్టాన్ని జాతీయ స్థాయిలో కూడా తీసుకురావటం ప్రయోజనకరం. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న తరుణంలో ఇది ఎంతో అవసరం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెటాతో ఒప్పందం ద్వారా నేరుగా మొబైల్ ద్వారా పౌర సేవలను అందించనుంది. నవంబర్ 30 నుంచి వాట్సప్ బిజినెస్ సర్వీసు ద్వారా 100 రకాల ధ్రువపత్రాలు, పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయి. వాట్సప్ బిజినెష్ సర్వీసు వేదిక ద్వారా ధ్రువపత్రాలు, పౌర సేవలు అందించనుంది. పౌరునికి అవసరమైన అన్ని రకాల సేవలకూ ఆన్‌లైన్‌ను సాధ్యమైనంతమేర విస్తరించటం, అవినీతి లేకుండా అందించటం, రాబోయే కాలంలో ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా సేవలు అందించటం ప్రభుత్వం తీసుకొచ్చే మార్పుల లక్ష్యం కావాలి. ఎంత సాంకేతికత ఉన్నా, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం ద్వారానే ఈ లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించగలం కాబట్టి, ప్రజల భాగస్వామ్యమున్న స్థానిక సాధికారత కోసం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి. ★

# నిరంతరం లక్ష్యం దిశగా ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్‌ని ప్రారంభించి ఈ ఏడాది అక్టోబర్ 19కి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వ్యవస్థాపకులు ఎం. పద్మనాభరెడ్డిగారికి, విలువైన ఈ పౌర సమాజ కృషిలో భాగస్వాములైన ఇతర మిత్రులకు ఆత్మీయ శుభాకాంక్షలు.

చిత్తశుద్ధి, దీర్ఘకాల దృక్పథం, రాజీలేని పోరాటం, వాస్తవాల ఆధారంగా విషయాల పరిశోధన, సమగ్రంగా అధ్యయనం చేసి, పౌర సమాజం ఏ విధంగా మంచి మార్పుకి దోహదం



చేయగలదు అని లోతుగా ఆలోచించి దానికి తగ్గట్టు మీరు కృషి చేశారు.

ప్రజాస్వామ్యం నిలవాలి అంటే కేవలం ఎన్నికలు చాలవు. ప్రజలు పాలనలో భాగస్వాములు కావాలి. తమ ఉమ్మడి సేవలకు సంబంధించిన అంశాల మీద దృష్టిని పెట్టాలి. నిరంతరం జాగురూకులై ఉండాలి, స్థానికంగా ఎక్కడికక్కడ మార్పుల కోసం నాంది పలకాలి. విస్తృతస్థాయిలో మార్పుల కోసం గొంతు విప్పి సంఘటితం కావాలి. సంఘటితంగా, పరిజ్ఞానంతో మందిహితం కోసం గొంతు విప్పటం ప్రజాస్వామ్యంలో మార్పుకి మార్గం.

రాజ్యాంగ రచనప్పుడు అంబేద్కర్ ఒక మాట స్పష్టంగా చెప్పారు. ఒక్కసారి మనకు ఓటు హక్కు వచ్చాక, రాజ్యాంగ హక్కులు లభించాక, పౌర సమాజం చేసే పోరాటాలు శాంతియుతంగా, చట్టబద్ధంగా, ఇతరుల స్వేచ్ఛకి ఏ రకమైన ఆటంకమూ లేనిరీతిలో జరగాలి. అంతేగాని, వలసపాలన కాలంలోలాగా పరాయివాళ్ల మీద పోరాటం కోసం చేపట్టిన హర్తాళ్లు, బంద్‌లు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు, ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయి. ఈ ఆలోచనని పూర్తిగా ఆకళింపు చేసుకుని నిరంతరం ఆ లక్ష్యానికి కార్యక్రమాలు నడుపుతున్న సంస్థ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్.

**సుపరిపాలన అంటే ఏమిటి?**

కేవలం స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగి, నిజాయతీగా ఓట్లను లెక్కించి, నెగ్గినవాళ్లు శాంతియుతంగా అధికారంలోకి వస్తే, అంత మాత్రం చేత అది పూర్ణ ప్రజాస్వామ్యం కాజాలదు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు, శాంతియుతంగా అధికార మార్పిడి అవసరం. కానీ అవి చాలవు. నిజమైన ప్రజాస్వామ్యంలో పౌరుల స్వేచ్ఛ, ఇతరుల స్వేచ్ఛకు ఆటంకం కలగనిరీతిలో విస్తరించాలి. అధికారం వికేంద్రీకృతమై పౌరులకు వీలైనంత చేరువగా, పారదర్శకంగా, ప్రజలకు అర్థమయ్యే రీతిలో నిర్ణయాలు జరగాలి. ఆ రకమైన పరిపాలనలో పౌరుల నిరంతర

భాగస్వామ్యం ఉండాలి. అప్పుడే ప్రజలు వేసే ఓటుకి, పౌరుల కుటుంబాల భవిష్యత్తుకి మధ్య సంబంధం ఓటర్లకు అర్థమవుతుది. అప్పుడే మనం కట్టే పన్నుకి, మనకు అందే సేవలకి మధ్య బంధం బలపడుతుంది. అప్పుడే అధికారం, జవాబుదారీతనం పూర్తిగా ఏకీకృతమవుతాయి. మన కేంద్రీ కృత పరిపాలనలో ఈ లక్షణాలు చాలా తక్కువ. ఇక ఆధు నిక యుగంలో, అందునా ప్రజాస్వామ్యంలో చట్టబద్ధ పాలన అత్యంత కీలకం. బడితె ఉన్నవాడిదే బర్రె అయి నట్లయితే, అధికారం ఉన్నవాడు ఏ శృంఖలాలు లేకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటుంటే, సంపన్నుడికి, బలవంతుడికి ఓ చట్టం, సామాన్యుడికి, బీదలకి మరో చట్టం అయినట్లయితే అది ప్రజాస్వామ్యం కాజాలదు. అలాంటి చట్టబద్ధపాలనకి, మనం చాలా దూరంలో ఉన్నాం. అన్నిటినీ మించి ప్రజాస్వా మ్యంలో పొరపాట్లను తేలిగ్గా సరిదిద్దుకునే ఏర్పాట్లు కావాలి. ఈ స్వయందిద్దుబాటు శక్తి ప్రజా స్వామ్యానికి మూలం. నిరంకుశత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య ఉన్న తేడా అదే. మన ప్రజాస్వామ్యం ఏర్పడి 74 సంవత్సరాలు పూర్తయినా, మన జాతి నిర్మాతలు కలలుగన్న వ్యవస్థ ఇంకా రూపుదిద్దుకోలేదు. ఇప్పటివరకూ మనం సాధించిన విజయాలు గొప్పవి. దుర్భర దారిద్ర్యం, అవిద్య, ప్రపంచంలో ఎక్కడాలేనిరీతిలో అపారమైన వైవిధ్యం – కులం, మతం, ప్రాంతం, భాష వగైరా, వీటన్నిటినీ అధిగమించి మనం స్వేచ్ఛని, దేశ ఐక్యతని, సమాజంలో శాంతిని కాపాడుకోగలిగాం. అలాగే మనలో ఎన్నికల్లో ఎన్ని అవకతవకలున్నా, స్వేచ్ఛగా ఓటేస్తున్నాం, శాంతి యుతంగా ప్రభుత్వాన్ని మార్చుకోగలుగుతున్నాం. ఇన్ని భాషల మధ్య, సయోధ్యని సాధించగటంగాని, వందలాది సంస్థానాలను శాంతియుతంగా దేశంలో విలీనం చేయటంగానీ ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైన విజయాలు. అయితే, ఈ దేశంలో ప్రతి బిడ్డకీ, పుట్టిన పుట్టుకతో నిమిత్తం లేకుండా, కులమతాలకు అతీతంగా, అందరికీ సమానమైన స్వేచ్ఛలు ఉండాలంటే, బీదరికాన్ని నిర్మూలించాలంటే, ప్రతి పౌరుడికి, మహిళకి ఆనందమయ జీవితాన్ని అందిం చాలంటే, మన రాజకీయంలో, పరిపాలనలో, వ్యవస్థలో కీలకమైన మార్పులు కావాలి. ప్రతి ఎన్నికలో ప్రజలు ఓటు ద్వారా మార్పు కోసం తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు. కానీ జడత్వానికి అలవాటుపడిన రాజకీయ పార్టీలు, ప్రతి నిధులు, పరిపాలనా యంత్రాంగం తీరు వల్ల ఆటగాళ్లు మారుతున్నారుగానీ ఆటనియమాలు మారటం లేదు.

రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం, డబ్బుతో, కులమతాలతో ఓటర్లని ప్రలోభపెట్టని విధానంలో సమర్థులని, ప్రజాసేవా తత్పరత గలవారిని నాయకత్వంలో



కూర్చోబెట్టే ఎన్నికల వ్యవస్థ ఏర్పాటు, జవాబుదారీతనంతో కూడిన పూర్తి అధికార వికేంద్రీకరణ, ప్రతి బిడ్డకీ డబ్బుతో నిమిత్తం లేకుండా అత్యున్నత ప్రమాణాల విద్య, ప్రతి కుటుంబానికీ సమర్థంగా అందే మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రజలందరికీ సకాలంలో, వేగంగా, నిష్పాక్షికంగా న్యాయాన్ని అందించే వ్యవస్థ, చట్టబద్ధపాలన, శరవేగంగా మారుతున్న ప్రపంచంలో వచ్చేతరాల భవిష్యత్తుకి భరోసా ఇచ్చే విధానాల రూపకల్పన, అమలు – ఇవన్నీ మన ముందున్న పెనుసవాళ్లు.

విజ్ఞత గల పౌరులంతా ఆలోచించినప్పుడే, సంఘటితంగా గొంతు విప్పినప్పుడే, రాగద్వేషాలకి, ఈసునసూయలకి దూరంగా దూరదృష్టితో ఆలోచించినప్పుడే, నిరంతర జాగురూకత ద్వారానే ప్రజాస్వామ్య ఫలాలను అందు కోగలం. అందుకే, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వంటి సంస్థ లు వందలాదిగా వేళ్లూనుకోవాలి, భవిష్యత్తు పట్ల విశ్వా సంతో, సమాజం పట్ల మమకారంతో, మందిహితం కోసం నిరంతరం కృషి చేయాలి.

ఒక వ్యవస్థలో మార్పులు మనం కోరుకున్నంత వేగంగా రాకపోవచ్చు, కానీ పౌరులకి అవగాహన పెరిగినప్పుడు, అనుభవం ద్వారా ఎటువంటి మార్పులు ఎందుకు అవసరమో అర్థమైనప్పుడు, ఆ మార్పులు అనివార్యంగా వస్తాయి. గతంలో ఏ తరంలోనూ చూడని అద్భుత సాంకే తిక పరిజ్ఞానం ఈవేళ మనందరికీ అందుబాటులో ఉంది. ఓ వంక గతానుభవాన్ని దృష్టిలో ఉంచుకుని తేవలసిన మార్పుల కోసం పక్షపాతాలకు అతీతంగా పోరాడి ఆ మార్పుని సాధించటం, మరోవైపున నిరంతర జాగురూకత ద్వారా అధికారంలో ఉన్నవాళ్ల మీద నిఘా వేయటం పౌర సమాజం కీలక బాధ్యతలు. ఇవి రెండూ విజయవంతంగా చేస్తున్న ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్‌ని మనసారా అభినం దిస్తూ, ఇలాంటి ప్రయత్నాన్ని కొంతమందికి వదిలేసి దూరంగా కూర్చోకుండా పౌరులందరినీ భాగస్వాములు కమ్మని ఆహ్వానిస్తున్నాను. ✪

# తెలంగాణలో ఒక్కో విద్యార్థిపై రూ.95 వేలు దాటిన వ్యయం

- **2015-16లో ఖర్చు రూ.33,059**
- పాఠశాల విద్యలో ఏటేటా పెరుగుతున్న వ్యయం
- విద్యాసామర్థ్యాలలో మాత్రం మార్పు శూన్యం

**తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో చదువుతున్న ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి సంవత్సరం చేస్తున్న సగటు ఖర్చు రూ.95 వేలు దాటనుంది, తొమ్మిదేళ్ల క్రితంతో పోలిస్తే వ్యయం దాదాపు 3 రెట్లు పెరిగింది. కానీ, విద్యాప్రమాణాలు అదే తరహాలో పెరగకపోగా, నానాటికీ దిగజారుతున్నాయి. ప్రతీ అధ్యయనంలో తేలుతున్న వాస్తవమిది. ఏటేటా బడ్జెట్ పెరుగుతోంది. కొంతమేర సౌకర్యాలూ మెరుగవుతున్నాయి. అయినా విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2015-16లో ఒక్కో విద్యార్థిపై ఖర్చు రూ.33,059గా ఉన్నట్లు విద్యాశాఖ స్వయంగా 2017లో శాసనసభకు నివేదించింది. తాజా బడ్జెట్‌లో విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని లెక్కిస్తే ఆ వ్యయం ఏకంగా రూ.95,690కి చేరుకోనుంది (ఏపీలో ఇప్పటికే ఈ ఖర్చు రూ. లక్ష దాటింది. అయినా అక్కడా అభ్యసన సామర్థ్యాలు అధ్వాన్నంగా ఉన్నాయి).**

**విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గుదల**

| పాఠశాల విద్యాశాఖపై పెట్టిన ఖర్చు (రూ.కోట్లలో) | |
|---|---|
| 2019-20 | - 9,196.96 |
| 2020-21 | - 8,688.55 |
| 2021-22 | - 8,999.27 |
| 2022-23 | - 15,589 |
| 2023-24 | - 17,025 |
| 2024-25 | - 17,942 |

రాష్ట్రంలో 2015-16లో విద్యార్థుల సంఖ్య 24.12 లక్షలు. ఆ సంవత్సరం ఖర్చు చేసిన నిధులు రూ.7,974 కోట్లు. ఆ ప్రకారం ఒక్కో విద్యార్థిపై సగటు ఖర్చు రూ.33,059.



2023-24 విద్యాసంవత్సరం పాఠశాల విద్యాశాఖ పరిధిలోని 26 వేల బడుల్లో 23.78 లక్షలమంది పిల్లలున్నారు. ఆ ఏడాది ఖర్చు చేసిన నిధులు రూ.15,589 కోట్లు. అంటే ఒక్కో విద్యార్థిపై సగటు వ్యయం రూ.65,555. అలాగే గత సంవత్సరం (2023-24) సవరణ బడ్జెట్‌లో రూ.17,025 కోట్లు. విద్యార్థుల సంఖ్య కచ్చితంగా తెలియకున్నా గత ఏడాదితో పోల్చుకుంటే రెండు లక్షల మంది తగ్గారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారు. అంటే ఈసారి విద్యాశాఖ పరిధిలోని పిల్లల సంఖ్య 18.75 లక్షలుగా ఉండొచ్చు. కేటాయించిన బడ్జెట్ మొత్తం ఖర్చు చేస్తారనుకుంటే, ఒక్కో విద్యార్థిపై సగటు ఖర్చు రూ.95,680 అవుతుంది. ఇటీవల అధికారులు అంతర్గతంగా ఒక్కో విద్యార్థిపై అవుతున్న ఖర్చును లెక్కించినట్లు సమాచారం.

**విద్యాప్రమాణాలు మెరుగయ్యేనా?**

పాఠశాలలపై పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. రాష్ట్రవ్యాప్తంగా 602 మండలాలు ఉంటే 17 మందే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయులను ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా నియమిస్తూ రెండు నుంచి పదిమండలాల బాధ్యత అప్పగిస్తున్నారు. ఫలితంగా విద్యాప్రమాణాలు పెరగటం లేదు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు 2018తో పోల్చుకుంటే దారుణంగా పడిపోయాయని అసర్ సర్వే 2022లో వెల్లడించింది. గత విద్యాసంవత్సరం ప్రాథమిక పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచే కార్యక్రమమైన

**2023-24 విద్యాసంవత్సరం గణాంకాల ప్రకారం వివరాలివీ..**

| విద్యాసంస్థ | ప్రభుత్వ | స్థానిక సంస్థలు | కేజీబీవీ | ఆదర్శ | జనరల్ గురుకుల | యూఆర్ఎస్ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| బడులు | 1752 | 24,335 | 479 | 194 | 35 | 31 | 26,826 |
| విద్యార్థులు | 2,26,889 | 15,86,850 | 1,21,872 | 1,17,166 | 20,312 | 2,490 | 20,75,579 |
| టీచర్లు | 10,253 | 93,208 | 6,575 | 2,828 | 366 | 173 | 1,13,403 |

తొలిమెట్టు అమలు చేసినా ఒక్క ఏడాదికే పరిమితమైంది. తాజాగా బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తు, పరిశుభ్రత కోసం స్వచ్ఛ కార్మికులను నియమిస్తామని సర్కారు ప్రకటించింది. వసతులు, సిబ్బంది సమస్యలు చాలావరకు తీరినందున ఇక పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్లకు కూడా బాధ్యత అప్పగించింది. ఇటీవల వీరంతా ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సైతం పాఠశాలల్ని తనిఖీ చేయనున్నారు. ఉపాధ్యాయులు మాత్రం బోధనేతర పని తగ్గించాలని, 100 మంది విద్యార్థులున్న ప్రతి బడికి ఒక బోధనేతర ఉద్యోగిని ఇవ్వాలని, ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చూడాలని కోరారు. ✪

# నాణ్యమైన విద్యను అందించటం కేవలం ఉపాధ్యాయుల బాధ్యతట!



"తెలంగాణనే తీసుకుంటే, రాష్ట్రంలోని 30 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది పిల్లలు చదువుతుంటే, 10 వేల ప్రయివేటు స్కూళ్లలో 36 లక్షల మంది చదువుతున్నారు. మీ కంటే ఎక్కువ చదువుకున్న టీచర్లు ప్రయివేటు స్కూళ్లలో ఉన్నారా?" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఉపాధ్యాయుల సభలో ప్రశ్నించారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల తల్లిదండ్రులు నిరుపేదలు, అణగారిన వర్గాల వారు. వారిలో అత్యధికులు రెక్కాడితేగానీ డొక్కాడకున్నా, తమ కనీస అవసరాల్ని సైతం పక్కనపెట్టి పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లకు పంపటానికి ఆదాయాల్ని ఖర్చు చేస్తున్నారు. పలువురు అప్పులు కూడా చేస్తున్నారు. అయినా అక్కడా సరైన చదువు రావటం లేదు. అలా లక్షల మంది తెలంగాణ పిల్లల జన్యుసంపద వికసించకుండా వృథా అవుతుంటే ప్రయివేటు స్కూళ్ల గురించి ప్రభుత్వానికి పట్టదా? ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? అయినా కూడా, అవసరమైన నిధుల్ని ఖర్చు చేస్తున్నా విద్యలో ఎందుకు ఫలితాలు రావటం లేదు, ప్రభుత్వ స్కూళ్లలో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచటంతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోవాలి అన్న చర్చను ముఖ్యమంత్రి లేవనెత్తలేదు. అదేవిధంగా తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే సీఎం స్థాయికి ఎదిగానని తెలిపారు. తన తరంలో, అంతకుముందు కొన్ని తరాల్లో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్నవారిలో అనేకమంది వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారు, పలువురు ప్రపంచస్థాయిలో కూడా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు, అప్పుడు సాధ్యమైనది, ఇప్పుడెందుకు సాధ్యం కావటం లేదు అనే ప్రశ్నను అడగలేదు. స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచాల్సిన బాధ్యతను కేవలం అధికారులు, ఉపాధ్యాయుల మీద పెట్టేసి ప్రభుత్వం, సమాజం చేతులు దులుపుకోలేవని మన అనుభవాలు హెచ్చరిస్తున్నాయి.











విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా రాజమండ్రిలో నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్





RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th NOVEMBER, 2024 Posting Date 15 &16th of every month

SBI

Merchant Name : FOUNDATION FOR DEMOCRATIC

UPI ID : 52086568057@sbi

BHIM | UPI

BHARAT INTERFACE FOR MONEY | UNIFIED PAYMENTS INTERFACE

G20

भारत 2023 INDIA

वसुधैव कुटुम्बकम्

ONE EARTH • ONE FAMILY • ONE FUTURE

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**